

ప్రజా భద్రతే ప్రగతికి పునాది అని విశ్వసించే నాయకుడు సీఎం చంద్రబాబు. పోలీసు వ్యవస్థకు టీడీపీకి అవినాభావ సంబంధం ఉంది. ఏపీలో తొలి పోలీసు అకాడమీ ఏర్పాటు, డీఎస్పీ తరహాలో ఎస్సై, కానిస్టేబుళ్ల రిక్రూట్మెంట్, 23 వేల నియామకాల ఘనత సీఎం చంద్రబాబుదే.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 17.12.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 240 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# పోలీసుల గౌరవమే... ప్రభుత్వ గౌరవం





- ట్రైనీ కానిస్టేబుళ్లకు స్టైఫండ్ రూ.12,500కు పెంపు
- ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలతో యువతకు నియామకాల పండుగ
- రాజకీయ ముసుగులో నేరాలు చేసే వారిపట్ల జాగ్రత్త
- పోలీసులకు పూర్తి స్వేచ్ఛ- నేరస్తులపట్ల కఠినంగా ఉండాలని హితవు
- నూతన కానిస్టేబుళ్ల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారి కుటుంబ గాధల్ని విని చలించిన ముఖ్యమంత్రి
- ఎంపికైన 5,757 మందికి నియామక పత్రాలు అందించిన సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్)** : శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రజా భద్రతకే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పోలీసుల గౌరవాన్ని పెంచే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, ప్రజలకు రక్షణ ఇచ్చే బాధ్యత పోలీసులదని అన్నారు. పోలీసింగ్ లో ప్రిడిక్షన్, ప్రివెన్షన్, ప్రొటెక్షన్ విధానాన్ని అవలంబించాలని, రాజకీయ ముసుగులో నేరాలు చేసే వారి పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. మంగళగిరి ఏపీఎస్పీ 6 బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో కానిస్టేబుళ్ల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితతో కలిసి కానిస్టేబుళ్లుగా ఎంపికైన 5,757 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. కొత్తగా విధుల్లో చేరినవారు నిబద్ధతతో పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అలాగే శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లకు స్టైఫండ్ రూ. 12,500కు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ....గత ప్రభుత్వ అసమర్థ పాలనతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. రాష్ట్రాన్ని పునర్నిర్మించి , యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం. మీకు ఉద్యోగం వస్తే నాకు , మిత్రులు పవన్ కల్యాణ్ కు మంచి పేరు వస్తుందని 31 కేసులు వేశారు. వాటిని అధిగమించాం. కోర్టు కేసులు పరిష్కరించి నియాకమ పత్రాలను అందించాం. 6100 మంది రిక్రూట్మెంట్ కోసం నోటిఫికేషన్ ఇస్తే అందులో 6014 మంది సెలక్ట్ అయ్యారు. ఇందులో 5757 మంది ట్రైనింగ్ కు ఎంపిక అయ్యారు. వీరిలో సివిల్ కానిస్టేబుళ్లుగా 3,343 మంది, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా 2,414 మంది ఎంపికయ్యారు. సివిల్ లో మహిళా కానిస్టేబుళు 993 మంది ఉన్నారు. మగవారికి ఏ విషయంలోనూ మహిళలు తీసి పోకూడదనే ఉద్దేశంతో గతంలోనే ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేశాను. ఆర్టీసీలో మహిళలను కండెక్టర్లుగా నియమించాం. అలాగే ఉమ్మడి శ్రీకాకుళం, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో 183 మంది ఆదివాసీ అభ్యర్థులు ఎంపిక కావడం గర్వంగా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లకు స్టైఫండ్ ను రూ. 12,500కు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు సభా వేదిక నుంచి ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న రూ. 4,500 నుంచి స్టైఫండ్ రూ. 12,500 పెంచుతున్నామని.. మిగతా 2లో...

## ప్రజలపై వైద్య ఖర్చుల భారం తగ్గాలి



- ప్రివెంటివ్ హెల్త్ విధానాలపై ప్రత్యేక దృష్టి
- త్వరలో ప్రజల డిజిటిల్ హెల్త్ రికార్డులు
- వైద్యారోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు
- ప్రజారోగ్యంపై గేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యున్నతస్థాయి వైద్య సలహా బృందంతో సీఎం తొలి సమావేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: ప్రజారోగ్య పరిరక్షణకు మెరుగైన విధానాలను అవలంబిస్తూ ప్రజలకు సేవలు అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకోవడంతోపాటు... నిపుణుల సలహాలను తీసుకోవాలని సీఎం సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై సమీక్షించారు. ఈ మేరకు గేట్స్ ఫౌండేషన్ తో కలిసి వైద్యారోగ్య రంగంలో ప్రభుత్వం అమలు చేస్తోన్న సంజీవని సహా వివిధ ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు చర్చించారు. ఏపీలో మెరుగైన ప్రజారోగ్య నిర్వహణకు గేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైద్యారోగ్య రంగంలోని నిపుణులతో కూడిన 10 మంది సభ్యుల బృందాన్ని ఏర్పాటు చేశారు. యూఎన్ఎయిడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీటర్ పాయిట్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సీనియర్ శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్, ఏఐజీ ఛైర్మన్ డి. నాగేశ్వర్ రెడ్డి, సింగపూర్ నేషనల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టియో, రిటైర్డ్ ఐఏఎస్ ఆర్తి అహుజా, సైటెస్ ఛైర్ పర్సన్ రిజ్వాన్ కొయిటా, కోస్లా ల్యాబ్స్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ నాదముని, గేట్స్ ఫౌండేషన్ జినోమిక్స్ అండ్ ఎపిడామిలజీ డైరెక్టర్ డాక్టర్ గగన్ దీప్ కాంగ్, పబ్లిక్ హెల్త్ నిపుణురాలు మార్గరెట్ ఎలిజిబెత్, మిగతా 2లో...

## వేదికపై చేసిన విజ్ఞప్తి...

# క్షణాల్లో రోడ్డు మంజూరు



- నిమిషాల్లో పని పూర్తి చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :కానిస్టేబుల్ నియామక పత్రాల ప్రదాన కార్యక్రమం వేదికగా గిరిజన యువకుడు చేసిన ఒక విజ్ఞప్తి నిమిషాల్లోనే కార్యరూపం దాల్చింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సభ జరుగుతుండగానే స్పందించి, గ్రామానికి రహదారి నిర్మాణానికి తక్షణ పరిపాలనా చర్యలు ప్రారంభించారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి కానిస్టేబుల్‌గా ఎంపికైన లాకే బాబూరావు తన జీవిత ప్రయాణాన్ని వివరించే సందర్భంగా, ఇప్పటికీ రహదారి లేని తన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. మిగతా 2లో...

# ప్రపంచానికే ఆదర్శంగా ఏవియేషన్ ఎడ్యుసిటీ


- ఈ రోజు ఏపీలో మీరు చూస్తున్నది ఓ చరిత్ర
- కొంతమంది విజన్ లెస్ పీపుల్ విజనరీని ఎగతాళి చేస్తారు
- ఏపీ అభివృద్ధికి మిస్సైల్స్ గా పనిచేస్తున్నాం
- ప్రపంచ సివిల్ ఏవియేషన్ వర్క్ ఫోర్స్ లో 25 శాతం తెలుగువారు ఉండాలనేది లక్ష్యం
- జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రాజెక్ట్ ప్రారంభ వేడుకలో మంత్రి నారా లోకేష్
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో జీఎంఆర్- మాన్సాస్ మధ్య ఎంవోయూ




**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్ )** : జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుంది. ఈ రోజు ఏపీలో మీరు చూస్తున్నది ఓ చరిత్ర. ప్రపంచ సివిల్ ఏవియేషన్ వర్క్ ఫోర్స్ లో 25 శాతం తెలుగువారు ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు పనిచేస్తున్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మాన్సాస్ ట్రస్ట్ సహకారంతో భోగాపురం సమీపం భీమిలి మండలం అన్నవరం వద్ద 136.63 ఎకరాల్లో జీఎంఆర్ సంస్థ అభివృద్ధి చేయనున్న జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రాజెక్ట్ కు నేడు అంకురార్పణ జరిగింది. విశాఖ రాడిసన్ బ్లూ రిసార్ట్ లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో జీఎంఆర్– మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రాజెక్టుకు సంబంధించిన అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రాజెక్ట్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. బీహార్ లో ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్లినప్పుడు చాలా మంది కేంద్ర, రాష్ట్ర ముఖ్యమంత్రులు హాజరయ్యారు. 3లో...

# ఆక్వా కల్చర్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- రైతుల ఆదాయం పెంపే లక్ష్యం : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ )** :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఆక్వా రంగం కీలకమైన ఆధారంగా మారిందని, ఆక్వా కల్చర్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం కృష్ణా జిల్లా పెనమలూరులోని మత్స్య శాఖ కార్యాలయంలో రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి అధికార సంస్థ పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్ ల వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులు ఆక్వా రైతులపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, వాటిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటోందన్నారు. దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రొయ్యలకు ఉన్న నాణ్యత, విశ్వసనీయతపై విస్తృత ప్రచారం అవసరమని, కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతుల పెంపు, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. నాణ్యతపై ప్రతి రైతు దృష్టి పెట్టాలని, అప్పుడే మంచి ధర లభిస్తుందన్నారు. దేశ మత్స్యరంగంలో ఆంధ్రప్రదేశ్ వాటా 29 శాతం ఉందని తెలిపారు. చేపలు, రొయ్యల చెరువులకు సర్వే నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలని సీఎం సూచించారని, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 48 శాతం చెరువుల రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. గతంలో రైతులు చెరువుల రిజిస్ట్రేషన్ విషయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించామని, చెరువులకు జియో ట్యాగింగ్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఆక్వారంగ సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఆక్వా రైతులకు రూ. 800 కోట్ల విద్యుత్ రాయితీ అందించామని, మిగతా 2లో...

# పీజీ మెడికల్... అదనంగా 36 సీట్లు మంజూరు

- 5 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో
- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ వైద్య విద్యలో అదనంగా 36 సీట్లను జాతీయ వైద్య కమిషన్ మంజూరు చేసింది. తొలివిడతలో ఇంతకుముందే 60 సీట్లను ఎన్ఎంసీ మంజూరు చేసింది. మరికొన్ని సీట్ల మంజూరు కోసం కూటమి ప్రభుత్వం అవసరమైన నియామకాలు చేపట్టడమే కాకుండా మౌలిక సదుపాయాలను సదరు కళాశాలల్లో కల్పించింది. మిగతా 2లో...

# టూరిజం హబ్ గా పోలవరం



- లేఔట్ ప్లాన్ డిజైన్ చేస్తున్నట్లు మంత్రి నిమ్మల వెల్లడి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: పోలవరం ప్రాజెక్టులో లైడార్ సర్వే చేసి గుర్తించిన 9900 ఎకరాల ప్రాంతాన్ని టూరిజం హబ్ గా మార్చబోతున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఇందుకు సంబంధించి లేఅవుట్ ప్లాన్ డిజైన్ చేస్తున్నామన్నట్లు ఆయన పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలో మంగళవారం పోలవరం స్పిల్ వే బ్యూటిఫికేషన్ కు సంబంధించి, మిగతా 2లో...

# గుంతల రహిత రహదారులే ప్రభుత్వ లక్ష్యం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ )** : రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన రహదారుల మరమ్మతుల పనులు చేపడుతున్నామని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వంలో త్వరితగతిన రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి చేసి, వెహికల్ మూమెంట్ తీసుకురావడమే లక్ష్యంగా ఆర్ & బీ శాఖ ఒక కీలక నిర్ణయం తీసుకుంది.

ఆర్ & బి శాఖలో రహదారుల అభివృద్ధికి సంబంధించిన కాంట్రాక్ట్ పనులకు టెండర్లు పిలిచే క్రమంలో.. సాధారణంగా టెండర్లకు ఒకే బిడ్ వచ్చే సందర్భంలో.. తిరిగి టెండర్లు రీకాల్ చేయడం ఆనవాయితీ.. అయితే దీని కారణంగా తిరిగి మళ్లీ, మళ్లీ నూతనంగా టెండర్లు పిలవడం, బిడ్ లు సమర్పించడం.. వాటిని ఫైనల్ చేసి, ఒప్పందాలు పూర్తిచేసి పనులు చేపట్టడానికి దాదాపు 45 రోజులు పైగా సమయం పడుతోంది. దీంతో పనులు సకాలంలో ప్రారంభం కాకపోవడంతో, మిగతా 2లో...

# ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా రుషికొండ ప్యాలెస్

- ప్రజలకు ఉపయోగపడేలా, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా రుషికొండ ప్యాలెస్ ను వినియోగిస్తాం
- మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయ స్వామి
- త్వరలోనే మరోసారి భేటీ.. అనంతరం రెండు మూడు ఆప్షన్ లు కేబినెట్ దృష్టికి తీసుకెళ్లి తుది నిర్ణయం వెల్లడిస్తామని స్పష్టం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ )** : పర్యాటక శాఖకు ఆదాయం వచ్చేలా, ప్రజలకు కూడా ఉపయోగపడేలా రుషికొండ ప్యాలెస్ పై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామమని మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. రుషికొండ ప్యాలెస్ ను ఏ విధంగా వినియోగించాలన్న అంశంపై నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ రెండవ భేటీ మంగళవారం వెలగపూడి సచివాలయం రెండవ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్ లో జరిగింది. భేటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయస్వామి, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, టూరిజం ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి కాటలు పాల్గొని సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా గత భేటీలో సూచనల మేరకు ప్రజలు, స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాన్ని పర్యాటక శాఖ అధికారులు సబ్ కమిటీ ముందుంచారు. మిగతా 2లో...

# సివిల్స్ ఉచిత శిక్షణ ద్వారా పేద విద్యార్థుల కల సాకారం




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ )** : ఐ.ఏ.ఎస్ కావాలన్న పేద విద్యార్థుల కలను సాకారం చేసేందుకే అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా సివిల్స్ ఉచిత శిక్షణనిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం నాడు విజయవాడ అంబేద్కర్ స్టడీ సర్కిల్లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సివిల్స్ ఉచిత శిక్షణను మంత్రి డా. స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గత వైసీపీ ప్రభుత్వం అంబేద్కర్ స్టడీ సర్కిళ్లను నిర్వీర్యం చేసింది. ఐ.ఏ.ఎస్ కావాలన్న పేద విద్యార్థుల కలను సాకారం చేసేందుకే అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా సివిల్స్ ఉచిత శిక్షణనిస్తున్నాం. రాష్ట్రంలో విజయవాడ, విశాఖ, తిరుపతి అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో 340 మందికి సివిల్స్ ఉచిత శిక్షణనిస్తున్నాం. శిక్షణ కాలంలో అభ్యర్థులకు స్టడీ మెటీరియల్స్ తో పాటు బోజనం, వసతి ఉచితంగా కల్పిస్తున్నాం. ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని పేద విద్యార్థుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల చేయూతనిస్తోంది. సివిల్స్ కోచింగ్ అభ్యర్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి. పేద పిల్లలు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పం. డా. బిఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా పేద విద్యార్థుల్ని పెద్ద మెత్తంలో ఐఏఎస్ చేయాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నాం. విశాఖ కేంద్రంగా రాష్ట్రంలోని అభ్యర్థులందరికీ సివిల్స్ ఉచిత శిక్షణిచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్టు మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఐ.ఏ.యస్ వి. ప్రసన్న వెంకటేష్, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ ఐ.ఏ.యస్ బి. లావణ్యవేణి, ఐ.ఏ.యస్ సదా భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# వేదికపై చేసిన విజ్ఞప్తి... క్షణాల్లో రోడ్డు మంజూరు




(మొదటి పేజీ తరువాయి)

యువకుడి మాటలకు స్పందించిన ముఖ్యమంత్రి, రోడ్డు నిర్మాణ బాధ్యతను వేదికపై ఉన్న ఉప ముఖ్యమంత్రికి అప్పగించారు.

దీంతో వెంటనే చర్యలకు ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం దేవరపల్లి పంచాయతీ పరిధిలోని తెనుములబండ గ్రామం నుంచి ఎలుగురాతిబండ వరకు 2 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేయడంతో పాటు, అవసరమైన పరిపాలనా అనుమతులు వెంటనే ఇవ్వాలని సూచించారు.

ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏఎస్ఆర్ జిల్లా కలెక్టర్ తక్షణమే పరిపాలనా అనుమతులు జారీ చేశారు. వేదికపై చేసిన విజ్ఞప్తి సభ ముగిసేలోగా రోడ్డు మంజూరుగా మారడం కార్యక్రమానికి హైలైట్‌గా నిలిచింది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనంగా కనిపించింది.

## ఆక్వా కల్చర్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం



(మొదటి పేజీ తరువాయి)

దీన్ని రూ. 1,200 కోట్లకు పెంచుతున్నామని, రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే విద్యుత్ రాయితీ వర్తిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

**బీసీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ వైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని, కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు సహా డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బలహీన వర్గాల ఎదుగుదల తెలుగుదేశం పార్టీ పాలనలోనే సాధ్యమైందని అన్నారు. గతంలో కులాల వారీగా వారి వృత్తుల ఆధారంగా పరికరాలు అందించి అభివృద్ధికి దోహదం చేశామని, 2019 తర్వాత వచ్చిన ప్రభుత్వం అనగారిన వర్గాల అభ్యున్నతిని పక్కనపెట్టిందని విమర్శించారు. కేవలం గొప్పలు చెప్పుకునేందుకు 54 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు నాయుడు బీసీల అభ్యున్నతికి ఆహర్నిశలు శ్రమిస్తున్నారని, జనాభా దామాషా ప్రకారం ప్రతి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి వర్గాల అభివృద్ధికి వినియోగిస్తామని హామీ ఇచ్చారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే బీసీలకు ఎక్కువగా ఉద్యోగాలు, మెడికల్ సీట్లు లభించాయని గుర్తు చేశారు. వైశ్యులను ఓబీసీలో చేర్చే అంశంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని, ఈ విషయమై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రధానితో కూడా చర్చించారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## పీజీ మెడికల్...అదనంగా 36 సీట్లు మంజూరు



(మొదటి పేజీ తరువాయి)

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారుల సూచనల మేరకు ఏలూరు, రాజమహేంద్రవరం, నంద్యాల, విజయనగరం, మచిలీపట్నం కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎన్ఎంసీకి దరఖాస్తుచేశారు. ఇదే సమయంలో మంత్రి సత్యకుమార్ తనకు ఉన్న విస్తృత పరిచయాల మేరకు అదనపు సీట్ల మంజూరుపై చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు ఏలూరు వైద్య కళాశాలకు-12, రాజమహేంద్రవరం-4, మచిలీపట్నం-8, నంద్యాల-4, విజయనగరం కళాశాలకు 8 చొప్పున సీట్లను పీజీ వైద్య విద్యలో ఎన్ఎంసీ కేటాయించినట్లు మంగళవారం డీఎంఈ డాక్టర్ రఘునందన్ ఓ ప్రకటనలో తెలిపారు తొలివిడతలో వచ్చిన 60కు 36 కలిపితే మొత్తం 96 సీట్లు వచ్చినట్లు లెక్క

## టూరిజం హబ్ గా పోలవరం



(మొదటి పేజీ తరువాయి)

ఆర్కిటెక్ట్స్, ఏజెన్సీ ప్రతినిధులతో మంత్రి సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదనంతో పాటు రాష్ట్ర ఔన్నత్యం చాటేలా పోలవరం స్పిల్ వే ఉండాలని సూచించారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పోలవరం లెఫ్ట్ బ్యాంకును కలుపుతూ వంతెనల నిర్మాణానికి సైతం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. జాతీయ రహదారులు 365 బిబి నుంచి 516ఈ ని అనుసంధానం చేయాలన్నారు. ఇందుకుగాను రోడ్డు రవాణా సౌకర్యం ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయమని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఉన్నతాధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, ఆర్కిటెక్ట్స్ పాల్గొన్నారు.

# పోలీసుల గౌరవమే...ప్రభుత్వ గౌరవం

(మొదటి పేజీ తరువాయి)

సంక్రాంతి, క్రిస్మస్ పండుగలతో పాటు నియామక పండుగ కూడా అందరిలో సంతోషాన్ని నింపిందని సీఎం అన్నారు.

**పారదర్శకంగా కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ :** గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను మభ్య పెట్టడానికి మొక్కుబడిగా నోటిఫికేషన్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం రికార్డ్ టైమ్‌లోనే పరీక్షలు, రిక్రూట్మెంట్ ప్రక్రియ నిర్వహించి 60 రోజుల్లోనే ఫలితాలు ప్రకటించింది. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాం. నియామకాల్లో టెక్నాలజీ సాయాన్ని తీసుకున్నాం. మానవ జోక్యం అనేది లేకుండా అన్ని ఫిజికల్ ఈవెంట్స్‌లో టెక్నాలజీని వినియోగించాం. డిజిటల్ మీటర్లతో ఎత్తు, ఛాతీ కొలతలు తీసుకున్నాం. లైవ్‌గా రికార్డ్ చేసి సర్వర్లలో భద్రపరిచాం. ఆర్ఎఫ్ ఐడీ చిప్‌లతో 100 మీటర్లు, 1600 మీటర్ల పరుగులు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించాం. కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు ఎంపికైన ఒక్కోక్కరిది ఒక్కో గాథ. వారికి విద్యను, విలువల్ని నేర్పిన వారి తల్లితండ్రులకు అభినందనలు తెలియచేస్తున్నాను. కానిస్టేబుల్ గా ఎంపికైన గిరిజన యువకుడు బాబూరావు తన సొంత గ్రామానికి రహదారి వేయాలని సామాజిక హితం కోసం కోరారు. దీనికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రియల్ టైమ్ లోనే అనుమతులను, నిధుల్ని మంజూరు చేయించారు. అల్లూరి జిల్లా జీకేవీధిలోని వెలుగురాతిబండ- తిమ్మల బండ గ్రామానికి రోడ్డు నిర్మించేందుకు రూ. 3.90 కోట్లు మంజూరు చేయడం ప్రజా సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని సీఎం చంద్రబాబు అన్నారు. ఉద్యోగాలు రావాలంటే ఎన్డీఏ రావాలని ప్రజలు ఆకాంక్షించి మమ్మల్ని గెలిపించారు. నేను ముఖ్యమంత్రిగా ఇప్పటివరకూ పోలీస్ శాఖలో 23,676 ఉద్యోగాలు ఇచ్చాను. రాష్ట్రంలో 58 వేల మంది కానిస్టేబుళ్లు ఉండగా వారిలో 24 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చినందుకు గర్వ పడుతున్నాను. ఎన్నికల



మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం. ఇప్పటికే మెగా డీఎస్సీ ద్వారా 15,591 ఉద్యోగాలు ఇచ్చాం. అన్ని శాఖల్లో కలిపి 4 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయి. 18 నెలల పాలనలో రూ. 8.5 లక్షల పెట్టుబడులకు ఆమోదం ఇచ్చాం. విశాఖలో 538 ఎంఓయూలు చేస్తే రూ.11.38 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. 735 పరిశ్రమలు, రూ.19 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు.

**నేరాల నియంత్రణకు పీపీపీ విధానం:** కూటమి ప్రభుత్వం వచ్చాక సమర్ధవంతమైన పోలీస్ వ్యవస్థకు శ్రీకారం చుట్టాం. విజిబుల్ పోలీసింగ్ -ఇన్విజిబుల్ పోలీస్ విధానంతో ముందుకు వెళుతున్నాం. నేరాల నియంత్రణలో పోలీసులు టెక్నాలజీని వాడాలి. అప్పుడే క్రిమినల్స్ ఆటలు కట్టించవచ్చు. నేరాలను తగ్గించేందుకు అవసరమైన ప్రణాళికలు అమలు చేయాలి. ముందు జాగ్రత్తల ద్వారా, అప్రమత్తత ద్వారా నేరాలను తగ్గించవచ్చు. డాటా, టెక్నాలజీ ద్వారా నేరాలను నియంత్రించే అవకాశం రావాలి. నేరం జరిగిన వెంటనే మీరు వేగంగా స్పందించాలి. ఒకప్పుడు నేరస్తులు రాజకీయాల్లో ఉండేవారు కాదు. నేడు రాజకీయ ముసుగులో నేరాలు చేసే వాళ్లు తయారు అయ్యారు. రాష్ట్రంలో లేడీ డాన్లను కూడా చూసే పరిస్థితి వచ్చింది. గత పాలనలో శాంతిభద్రతలు ఎంతగా దిగజారాయో ఇది ప్రత్యక్ష ఉదాహరణ. వివేకా హత్య కేసులో నాపై ఆరోపణలు చేశారు. గుండె పోటు అని చెప్పి ముఖ్యమంత్రిగా నన్నే ఏమార్చారు. గదిలో రక్తపు మరకలు కడిగించినా సీఐ ఉన్నతాధికారులకు చెప్పలేదు. కానీ సీబీఐ తన దర్యాప్తులో గూగుల్ టేకవుట్ వంటి సాంకేతిక విధానాలను వినియోగించడం ద్వారా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అలాగే పాస్టర్ ప్రవీణ్ మృతిలో సిసి కెమేరాల ఆధారాలు లేకపోయి ఉంటే హత్య అని చెప్పి ప్రభుత్వంపై నెపం వేసేవారని సీఎం అన్నారు.

**ప్రాణాపాయం వచ్చినా విధినిర్వహణలో వెరవలేదు :** శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. సమైక్యాంధ్రలో నేను ముఖ్యమంత్రిగా ఫ్యాక్షనిజం, రౌడీయిజం, నక్సలిజం అణిచివేశాం. మత కలహాలను అరికట్టాం. ప్రజలకు నష్టం కలిగించే వారిని ఉపేక్షించలేదు.. నాడు వేంకటేశ్వరుని సేవలో పాల్గొనేందుకు వెళ్తుంటే 23 క్లైమోర్ మైన్స్ ను నక్సలైట్లు పేల్చారు. స్వామి వారే నన్ను కాపాడారు. ప్రాణాపాయ సమయంలోనూ ముఖ్యమంత్రిగా నా విధినిర్వహణ మరువలేదు. నా భద్రత కంటే దోషుల్ని పట్టుకోవటం ముఖ్యమని ఎస్పీకి ఆదేశాలు ఇచ్చాను. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక నేరాలు అదుపులోకి వచ్చాయి. గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాం. సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాలు, డ్రగ్ మాఫియా, మహిళలపై అఘాయిత్యాలను పూర్తిగా అరికట్టాలి. ప్రజలకు, వారి ఆస్తులు భద్రత ఉందంటే అందుకు పోలీసులు రక్షణగా ఉండటమే కారణం. పోలీసులు పూర్తి స్వేచ్ఛతో పని చేసి రాష్ట్రాన్ని ఒక రోల్ మోడల్ గా నిలబెట్టాలి. అలాగే హోంశాఖను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న వంగలపూడి అనితను అభినందిస్తున్నాను. 18 నెలల్లో చరిత్ర సృష్టించాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. 2047 స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. అంతకుముందు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ర్యాంపులపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితతో కలిసి సీఎం నూతనంగా ఎంపికైన కానిస్టేబుళ్ల చెంతకు వెళ్ళి వారికి అభివాదం తెలియచేశారు. నియామక ప్రక్రియలో టాపర్లుగా నిలిచిన వారికి శాలువా కప్పి నియామకపత్రాన్ని, రాజ్యాంగ ప్రతిని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి అందించారు. సభావేదికపై టాపర్లుగా నిలిచిన వారి కుటుంబ పరిస్థితుల దృశ్యమాలికను వీక్షించిన ముఖ్యమంత్రి చలించి పోయారు. వారు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు..

# ప్రజలపై వైద్య ఖర్చుల భారం తగ్గాలి

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ ఎయిమ్స్ ఎండోక్రినాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ టాండన్ అత్యుతన్నతస్థాయి నిపుణుల సలహా బృందంలో ఉన్నారు. అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందం సభ్యులు వర్చువల్ గా ఈ సమీక్షకు హజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."వైద్యారోగ్య రంగంలో వివిధ ప్రమాణాలను అందుకునేలా డబ్ల్యూహెచ్ఓ లాంటి సంస్థలు నిర్దేశించిన అంశాలను అమలు చేస్తున్నాం. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను సంజీవని ప్రాజెక్టు ద్వారా రూపొందిస్తున్నాం. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాల్లో డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ఈ వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేశాం. రియల్ టైమ్ లోనే వారి వివరాలు తెలుసుకునేలా సంజీవని ప్రాజెక్టు పని చేస్తుంది. వివిధ అంశాల్లో ప్రజలకు సంబంధించిన ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుంది. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును అమలు చేస్తాం"అని సీఎం చెప్పారు.

**వైద్యారోగ్య రంగంలో టెక్నాలజీ వినియోగం:** "2047 స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా మేం ప్రయత్నాలు చేస్తున్నాం. ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం యోగాతో పాటు నేచురోపతిని ప్రోత్సహించాల్సి ఉంది. ప్రివెంటివ్ వెల్ నెస్, డిజిటల్ ఏఐ ఎనేబుల్డ్ హెల్త్, హెల్త్ ఫైనాన్సింగ్ రిఫార్మ్స్ లాంటి కీలకమైన అంశాలపై దృష్టి పెట్టాలి. వైద్యారోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున పెరగాలి. ఏపీలో మెడ్ టెక్ పార్కు ద్వారా అధునాతన వైద్య పరికరాలను రూపొందిస్తున్నాం. వ్యాధుల బారిన పడి ఆ తర్వాత చికిత్స తీసుకోవడం కంటే..ముందుగానే నియంత్రించేలా ప్రివెంటివ్ విధానాలపై దృష్టి పెట్టాలి. ఇలా చేయగలిగితే ప్రజల వైద్య ఖర్చులు చాలా వరకు తగ్గుతాయి. దీని ద్వారా ప్రజల ఆరోగ్యం బాగుంటుంది... ఆర్థిక వెసులుబాటూ కలుగుతుంది. వైద్యారోగ్య రంగంలో మరింత వినూత్నంగా ప్రాజెక్టులు చేపట్టేందుకు అత్యున్నత స్థాయి నిపుణుల బృందం సలహాలు ఇవ్వాలని కోరుతున్నాం. ముంబైలో త్వరలో గ్లోబల్ ఏఐ కన్వెన్షన్ జరగబోతోంది...ఆ కన్వెన్షనులో వైద్యారోగ్యంలో టెక్నాలజీ వినియోగంపై ఏపీ ప్రభుత్వం రూపొందిస్తున్న విధానాలను ప్రదర్శించాలని ఆలోచన చేస్తున్నాం. దీనికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలని నిపుణుల బృందాన్ని కోరుతున్నా. ప్రజల ఆరోగ్య డేటాను విశ్లేషించి ముందస్తుగానే తగిన నియంత్రణా చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. విధానాల రూపకల్పన ఒక్కటే సమస్యలకు పరిష్కారం కాదు. అది క్షేత్ర స్థాయిలో సమర్థంగా అమలు అయినపుడే అది విజయవంతం అవుతుంది. ఏడాదిలోగా ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను సిద్ధం చేస్తాం. స్క్రీనింగ్ లో టాప్ 10లో ఉన్న రోగాలను గుర్తించి విశ్లేషించేందుకు ప్రయత్నిస్తాం. ఇటీవల గిరిజన ప్రాంతాల



విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతను నేర్పేలా ఓ చిన్న కార్యక్రమం చేపట్టాం. వివిధ అంశాలకు ఆంధ్రప్రదేశ్ ఓ స్టార్టప్ ఏరియాగా ఉంటుంది. హెల్తీ,వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది. నిపుణుల బృందం విలువైన సలహాలను ఏపీలో అమలు చేస్తాం."అని ముఖ్యమంత్రి అన్నారు.

**ప్రజారోగ్య సంరక్షణకు నిపుణుల బృందం సూచనలు :** ఈ సందర్భంగా నిపుణుల సలహా బృందంతో ముఖ్యమంత్రి మాట్లాడారు. అలాగే ప్రజారోగ్యంలో వారి నుంచి సలహాలను కోరారు. ఈ నిపుణుల బృందం ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ సూచనలిచ్చింది. ప్రజారోగ్య పరిరక్షణ, ముందస్తు జాగ్రత్తలపై విలువైన సిఫార్సులు చేశారు. వైద్యారోగ్య రంగంలో నర్సులు, వైద్యులు అందుబాటులో ఉండడం ఎంత అవసరమో... పౌష్టిక ఆహారం అనేది ముఖ్యమని ప్రపంచ ఆరోగ్యసంస్థ సీనియర్ శాస్త్రవేత్త సౌమ్యా స్వామినాథన్ అన్నారు. వాయు, జల, భూ కాలుష్యాల ద్వారా ప్రజారోగ్యం ఇబ్బందుల్లో పడుతోందని చెప్పారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేలా ప్రజల్ని చైతన్యం చేయాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజారోగ్యాన్ని కేవలం మెడికల్ అంశంగానే చూడకూడదని యూఎన్ఎయిడ్స్ డైరెక్టర్ పీటర్ పాయిట్ స్పష్టం చేశారు. ఇతర అంశాలు కూడా ప్రభావితం చేస్తాయని ఆయన అన్నారు. రూట్ కాజ్ అనాలసిస్ చేస్తే ముందుగానే రోగాల బారిన పడకుండా నియంత్రణా చర్యలు చేపట్టవచ్చని విశ్రాంత ఐఏఎస్ ఆర్తీ అహుజా అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా యువతలో డయాలసిస్ పేషెంట్లు పెరుగుతున్నారని... దీనికి కాలుష్యమే ప్రధాన కారణమన్నారు. ఏఐ, డిజిటల్ హెల్త్ ద్వారా వైద్య సేవలు మెరుగ్గా అందుతున్నాయని సింగపూర్ నేషనల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ వైవై టియో చెప్పారు. ఈ మేరకు ప్రాధాన్యతలను విశ్లేషించుకుని ప్రజారోగ్యంలో సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. హెపటైటిస్ టీకాను సమర్థంగా వినియోగించుకున్న రాష్ట్రంగా ఏపీ ఉందని మార్గరెట్ ఎలిజబెత్ వెల్లడించారు. హెల్త్ ఇంటెలిజెన్స్ ద్వారా ప్రజారోగ్యంపై మెరుగైన విధానాల్ని తీసుకువచ్చే అవకాశం ఉంటుందని సూచించారు. డిజిటల్, ఏఐ ఎనెబుల్డ్ సేవలు వైద్యారోగ్యంలో ఇప్పుడు ముఖ్యమైన అంశాలుగా మారాయని శ్రీకాంత్ నాదముని అన్నారు. ఏఐ డాక్టర్ ద్వారా ప్రాథమికంగా రోగి సందేహాలు తొలగించవచ్చని చెప్పారు. సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్ కేర్ కేంద్రంగా ఏపీ తయారవుతోందని డాక్టర్ రిజ్వాన్ వెల్లడించారు. వైద్య విద్యార్థులు, నర్సుల లాంటి వారికి డిజిటల్ హెల్త్ కేర్ లో శిక్షణ అందించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ, రిస్క్ ఫ్యాక్టర్ ఎంత ఉందన్నది ప్రాథమికంగా గుర్తించాల్సి ఉంటుందని డాక్టర్ నిఖిల్ టాండన్ చెప్పారు. అన్ని వ్యాధులకు ఒకే రకమైన విధానాలను అనుసరించలేమని... ఈ మేరకు క్లినికల్ మేనేజ్మెంట్ అసెస్మెంట్ ద్వారా వేర్వేరు రకాలుగా వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేషన్ నుంచే హెల్త్ కేర్ సాధ్యం అవుతుందని డాక్టర్ నాగేశ్వర రెడ్డి అభిప్రాయపడ్డారు. ఫిట్ నెస్, హైజీన్ లాంటివి విద్యార్థుల దశ నుంచే ఈ తరహా హెల్త్ ఎడ్యుకేషన్ ను అమలు చేయాల్సి ఉంటుందని సూచించారు.

**ప్రభుత్వంతో కలిసి గేట్స్ ఫౌండేషన్ ముందుకు :** రాష్ట్రంలో గ్లోబల్ స్థాయి ప్రమాణాలతో వైద్యారోగ్య నిపుణులు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి గేట్స్ ఫౌండేషన్ పనిచేస్తోందని .. ఆ సంస్థ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ అన్నారు. ప్రజారోగ్య పర్యవేక్షణ కోసం ఓ హెల్త్ సెక్రటేరియట్ ఏర్పాటు చేసుకుని పర్యవేక్షించేలా కార్యాచరణ రూపొందిస్తామని ఆమె స్పష్టం చేశారు. వైద్యారోగ్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చేందుకు అవసరమైన సూచనల్ని నిపుణుల బృందం చేసిందని ..వారి సిఫార్సులు హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధన కోసం ఉపకరిస్తాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. నిపుణుల సలహాలను మరింత లోతుగా చర్చించి వాటిని ఏపీలో అమలు చేస్తామని సత్యకుమార్ అన్నారు. సీఎం చంద్రబాబు తరచూ ప్రజారోగ్యం రంగాన్ని ఎలా పటిష్ట పరచాలన్న అంశాలపైనే ఆలోచన చేస్తారని మంత్రి వివరించారు. ఇకపై ఏడాదిలో రెండుసార్లు నిపుణుల బృందంతో భేటీ అవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు. నిపుణులు ఇచ్చిన సలహాలను.. సూచనలను క్రోడీకరించి యాక్షన్ ప్లాన్ తయారు చేసే బాధ్యతను గేట్స్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ కు ముఖ్యమంత్రి అప్పగించారు.

# కేంద్ర గెజిట్ జారీతో ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్‌కు సుగమం: ఏపీటీఎఫ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ) :** కేంద్ర ప్రభుత్వం నూతన 26 జిల్లాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన పబ్లిక్ ఎంప్లాయ్మెంట్ ఆర్డర్ - 2025ను రూపొందించి, రాష్ట్రపతి గెజిట్ జారీ చేయడం పట్ల ఏపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయ రాజు, చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. దీనిద్వారా పబ్లిక్ ఎంప్లాయ్మెంట్ ఆర్డర్ - 1975 రద్దు చేస్తూ నూతన పబ్లిక్ ఎంప్లాయ్మెంట్ ఆర్డర్- 2025ను రూపొందించారు. దీని ప్రకారం 26 జిల్లాల్లో అన్ని సివిల్ పోస్టులకు లోకల్ క్యాడర్ ఆర్గనైజేషన్ చేయాల్సి ఉంది. ప్రధానంగా విద్యాశాఖలో కొత్తగా ప్రభుత్వ - మరియు పంచాయతీరాజ్ యాజమాన్యాలలోని ఉపాధ్యాయుల క్యాడర్లకు కూడా లోకల్ క్యాడర్ ఆర్గనైజేషన్ చేయాల్సి ఉంది. దీని ద్వారా గత మూడు దశాబ్దాలుగా ఇబ్బందులకు గురవుతున్న ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉమ్మడి సర్వీసు రూల్స్ సాధనకు సుగమం అయిందని ఏపీటీఎఫ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఈ ప్రక్రియ 27 నెలల కాలంలోపు జరగాలి అని గడువు ఉంది. నూతన లోకల్ క్యాడర్ ఆర్గనైజేషన్ అయ్యేలోపు 73,74 జీ.వోల ద్వారా మండల విద్యాశాఖ అధికారులను ఉమ్మడి సీనియారిటీ ద్వారా ఉప విద్యాశాఖాధికారులుగా పదోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేసింది. అదేవిధంగా నేడు రాష్ట్ర ప్రభుత్వం చైల్డ్ కేర్ లీవ్ ను మహిళలు మరియు ఒంటరి పురుషులకు సంబంధించి వారి పిల్లల వయోపరిమితిని తొలగిస్తూ, పదవి విరమణ వరకు ఉపయోగించుకునేలా జారీచేసిన జీవో 70 పట్ల ఏపీటీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది.

## గుంతల రహిత రహదారులే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అధ్వాన్నంగా మారిన రోడ్లతో ప్రజలు మరింత ఎక్కువకాలం ఇబ్బందులు పడే దారుణ పరిస్థితి నెలకొంటుంది.

ఈ జాప్యాన్ని నివారించి, ప్రజా సౌకర్యార్థం, త్వరితగతిన రహదారుల మరమ్మతులు - అభివృద్ధి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా.. ఆర్ & బీ శాఖలో తొలిసారి టెండర్లు పిలిచినప్పుడు, కేవలం ఒక్క బిడ్ మాత్రమే వచ్చినప్పటికీ.. రీ కాల్ కు ఆస్కారం లేకుండా.. దానిని పరిగణలోకి తీసుకుని, టెండర్ ఫైనల్ చేసి, పనులు ప్రారంభించేందుకు వెసులుబాటు కల్పిస్తూ, ఆర్ & బీ శాఖ నిర్ణయం తీసుకుందన్నారు.. తద్వారా అనవసర తాత్సారాన్ని నివారించడంతో పాటు, వేగవంతంగా పనులను పూర్తి చేసి, ప్రజలకు సకాలంలో మెరుగైన రహదారులు కల్పిస్తూ.. భద్రతతో కూడిన, సాఫీ ప్రయాణానికి కారణమవుతుందన్నారు..

## ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా రుషికొండ ప్యాలెస్



(మొదటి పేజీ తరువాయి)

రుషికొండ ప్యాలెస్ ను ఏ విధంగా వినియోగించాలన్న అంశంపై వెబ్ సైట్ లో స్పందన కోరగా 1517 మంది ప్రజలు, 44 మంది స్టేక్ హోల్డర్స్ అభిప్రాయం వ్యక్తం చేశారని అత్యధిక శాతం ప్రజలు గత ప్రభుత్వం చేసిన తప్పును త్వరితగతిన సరిదిద్ది ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని కోరారని వెల్లడించారు. మరికొందరు హొటల్, రిసార్ట్, మ్యూజియం, ఆర్ట్ గ్యాలరీ, సైన్స్ ప్లానిటోరియం, మైస్, వెల్ నెస్ సెంటర్ గా, ప్రభుత్వ కార్యాలయంగా వినియోగిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సబ్ కమిటీ వెల్లడించింది. అంతిమంగా సంస్థల సమర్థతను పరిగణలోకి తీసుకొని ప్రజలకు ఉపయోగపడుతూనే, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టేలా రుషికొండ ప్యాలెస్ ను వినియోగించేలా నిర్ణయం తీసుకుంటామని సబ్ కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని ఫలక్ నామా ప్యాలెస్ కట్టడాన్ని సహజత్వం కోల్పోకుండా ఏ విధంగా వినియోగిస్తున్నారనే అంశాన్ని ఉదహరించారు.

ఈ సందర్భంగా మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం రుషికొండపై పర్యాటక శాఖకు అధిక ఆదాయాన్నిచ్చే హరిత రిసార్ట్స్ స్థానంలో విజయనగర, కళింగ, చోళ, పల్లవ, గజపతి, వేంగి, ఈస్టర్న్ గంగ తదితర పేర్లతో కూడిన 7 బ్లాక్ లతో 19,968 చదరపు మీటర్లలో రాజప్రాసాదం లాంటి ప్యాలెస్ ను నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రస్తుతం ప్రతి నెలా 25-30 లక్షల మెయింటెనెన్స్ చార్జీల భారం పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలు, స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాన్ని తీసుకున్నామని త్వరలోనే దీన్ని పర్యాటక శాఖకు ఆదాయం వచ్చేలా, ప్రజలకు కూడా ఉపయోగపడేలా సముచిత నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే టాటా, అట్మోస్ఫియర్ కోర్, ఐహెచ్ సీఎల్, హెచ్ఈఐ తదితర సంస్థలు ప్యాలెస్ ను ఏ విధంగా వినియోగిస్తే బాగుంటుందో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లిబుచ్చాయని, మరికొన్ని విదేశీ సంస్థలు కూడా అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయన్నారు. కొన్నింటికి పూర్తిస్థాయి స్పష్టం రావాల్సి ఉందన్నారు. మరో భేటీకి పూర్తి స్పష్టత వస్తుందని అనంతరం రెండు మూడు ప్రతిపాదనలు కేబినెట్ దృష్టికి తీసుకెళ్లి ఆ తర్వాత సీఎం చంద్రబాబునాయుడు సూచనల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. సాధ్యమైనంత త్వరగా మరోసారి భేటీ అయి రుషికొండ ప్యాలెస్ పై కీలక నిర్ణయం తీసుకుంటామని సబ్ కమిటీ పేర్కొంది.

సమావేశంలో పర్యాటక శాఖ అధికారులు రుషికొండ ప్యాలెస్ కు సంబంధించిన ప్రజెంటేషన్ ఇచ్చారు.

# చైల్డ్ కేర్ లీవ్‌పై వయస్సు పరిమితి తొలగింపు అభినందనీయం: ఎన్‌జీజీఓ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పిల్లల వయస్సుతో సంబంధం లేకుండా మహిళా ఉద్యోగులు తమ సర్వీస్ కాలం మొత్తం ఎప్పుడైనా చైల్డ్ కేర్ లీవ్ వినియోగించుకునేలా 18 సంవత్సరాల వయస్సు పరిమితిని ఎత్తివేస్తూ ప్రభుత్వం జి.ఓ నం.70 (ఆర్థిక శాఖ)ను జారీ చేయడంపై ఏపీ ఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని మహిళా ఉద్యోగులకు గణనీయమైన మేలు చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.
ఇప్పటివరకు 18 సంవత్సరాల వయస్సు పరిమితి కారణంగా రాష్ట్రంలో సుమారు 60 శాతానికి పైగా మహిళా ఉద్యోగులు చైల్డ్ కేర్ లీవ్ ప్రయోజనాన్ని పూర్తిగా పొందలేకపోయారని విద్యాసాగర్ గుర్తు చేశారు. ఈ పరిమితి తొలగింపుతో మహిళా ఉద్యోగులకు ఉద్యోగ–కుటుంబ బాధ్యతల సమతుల్యత సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చైల్డ్ కేర్ లీవ్‌పై వయస్సు పరిమితి తొలగించాలని, అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలులో ఉన్నరెండేళ్ల చైల్డ్ కేర్ లీవ్‌ను రాష్ట్రంలోనూ అమలు చేయాలని ఏపీ ఎన్‌జీజీఓ గతంలో పలు మార్లు విజ్ఞప్తులు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా విద్యాసాగర్ గుర్తు చేశారు.
మహిళా ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు ప్రభుత్వానికి ఏపీ ఎన్‌జీజీఓ, ఏపీ జేఏసీ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం మహిళా ఉద్యోగుల సంక్షేమానికి దోహదపడే చారిత్రాత్మక అడుగుగా నిలుస్తుందని విద్యాసాగర్ పేర్కొన్నారు.

# గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి




**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్)** :గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలనిఏపీ వీఆర్ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం బాల కాశి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆటోనగర్ సిసిఎల్ఏ కార్యాలయం వద్ద ఏపీ వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. గ్రామ రెవిన్యూ సహాయకుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏపీ వీఆర్ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం బాల కాశి మాట్లాడుతూ.... రాష్ట్రంలో ని ఉమ్మడి 13 జిల్లాల్లో సుమారు 20వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకులు గ్రామ రెవెన్యూ వ్యవస్థలో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో రూ. 10,500 వేతనం పెరిగిందని, ఆనాటి నుంచి నేటి వరకు ఒక్క రూపాయి కూడా పెరగలేదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వీఆర్ఏలు తీవ్ర నిర్లక్ష్యానికి గురి అయ్యారని, చాలీచాలని వేతనాలతో పనిచేయాల్సి రావటంతో వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్లు వినతి పత్రాలు ఇచ్చినా సమస్యలపై సానుకూల స్పందన రాలేదన్నారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా ధర్నా చేపట్టామని తెలిపారు. తెలంగాణ తరహాలో పేస్కేల్ అమలు చేయాలని, నామినల్ వీఆర్ఏల నియామకం, కారుణ్య నియామకాలు, అర్హులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వీఆర్ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఎన్ పెద్దన్న, వైస్ చైర్మన్ లు టి అంజి ఎన్, నాగేశం, మర్రి వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, ఏఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మేడ హనుమంతరావు, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# చైల్డ్ కేర్ లీవ్ సడలింపుపై ఏపీ జేఏసీ అమరావతి హర్షం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో పనిచేస్తున్న లక్షలాది మహిళా ఉద్యోగినులకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పిల్లల వయస్సుతో సంబంధం లేకుండా, మహిళా ఉద్యోగులు తమ సర్వీస్ కాలం మొత్తం ఎప్పుడైనా చైల్డ్ కేర్ లీవ్ వినియోగించుకునేలా 18 సంవత్సరాల వయస్సు పరిమితిని ఎత్తివేస్తూ ప్రభుత్వం జి.ఓ నం.70 (ఆర్థిక శాఖ)ను 15-12-2025న జారీ చేసింది.
ఈ ఉత్తర్వులపై ఏపీ జేఏసీ అమరావతి హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో సుమారు 60 శాతానికి పైగా ఉన్న మహిళా ఉద్యోగులు ఇప్పటివరకు 18 సంవత్సరాల వయస్సు పరిమితి కారణంగా చైల్డ్ కేర్ లీవ్ ప్రయోజనాన్ని పూర్తిగా పొందలేకపోయారని సంఘం గుర్తు చేసింది. గత ప్రభుత్వంలో జి.ఓ నం.36 (16-03-2024) జారీ అయినప్పటికీ, ఆర్థిక శాఖ ఆమోదం లేక అమలుకాకపోయిందని తెలిపింది.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, చైల్డ్ కేర్ లీవ్‌పై వయస్సు పరిమితి తొలగించాలని, అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలులో ఉన్న రెండు సంవత్సరాల చైల్డ్ కేర్ లీవ్‌ను రాష్ట్రంలోనూ అమలు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి పలు వేదికల్లో నిరంతరంగా విజ్ఞప్తులు చేస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో 18-10-2025న ఉద్యోగ సంఘాలతో జరిగిన సమావేశంలో చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో మహిళా ఉద్యోగుల తల్లితనానికి గౌరవం పెరిగిందని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోషియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, కోశాధికారి కె. సంగీతరావు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.
అలాగే ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం కూడా ఈ ఉత్తర్వులను స్వాగతించింది. మహిళా విభాగం ఛైర్పర్సన్ పారేలక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, అసోషియేట్ ఛైర్‌పర్సన్ సైకం శివకుమార్ రెడ్డి, కోశాధికారి డా. సాయిలక్ష్మి ఈ నిర్ణయం లక్షలాది మహిళా ఉద్యోగినులకు మేలు చేస్తుందని పేర్కొన్నారు. సాంకేతిక, ఆర్థిక అభ్యంతరాలు ఉన్నప్పటికీ నిర్ణయం తీసుకున్న ఆర్థిక శాఖకు, మంత్రివర్గ ఉపసంఘ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
దేశంలోనే తొలిసారిగా చైల్డ్ కేర్ లీవ్‌పై వయస్సు నిబంధనను పూర్తిగా ఎత్తివేసిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని, రాష్ట్రంలోని 13 లక్షల ఉద్యోగుల్లో మెజారిటీగా ఉన్న మహిళా ఉద్యోగుల సంక్షేమానికి ఈ నిర్ణయం మైలురాయిగా నిలుస్తుందని ఏపీ జేఏసీ అమరావతి పేర్కొంది.

# ప్రపంచానికే ఆదర్శంగా ఏవియేషన్ ఎడ్యుసిటీ

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ ఓ ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లి పరిచయం చేసుకున్నాను. 18 నెలలుగా ఏపీలో ఏదో మ్యాజిక్ జరుగుతోందని, ఆ మ్యాజిక్ వెనుక సీక్రెట్ ఏంటని ఆయన అడిగారు. ఒకటి మిస్ప్రెల్స్, రెండోది జీపీఎస్ అని నేను సమాధానం చెప్పారు. జీపీఎస్ అంటే వేదికపై ఉన్న అయ్యన్నపాత్రుడు, అశోక్ గజపతిరాజు లాంటి పెద్దలు. మిస్ప్రెల్స్ కూడా వేదికపై ఉన్నారు. మా యంగ్ అండ్ డైనమిక్ లీడర్ కె.రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు. మేం మిస్ప్రెల్స్ గా పనిచేస్తున్నాం. జీపీఎస్ కూడా చాలా అవసరం.

**ఈ రోజు ఏపీలో మీరు చూస్తున్నది ఓ చరిత్ర :** ఈ రోజు ఏపీలో మీరు చూస్తున్నది ఓ చరిత్ర. మేం చరిత్ర సృష్టిస్తున్నాం. ఏపీకి ఏదో చేయాలి అని ఇక్కడున్న పెద్దలందరూ అహర్నిశలు కృషిచేస్తున్నారు. విభజనతో మనం చాలా నష్టపోయాం. దక్షిణ భారతదేశంలో ఏపీ తలసరి ఆదాయం చాలా తక్కువగా ఉంది. దీనిని అధిమించాలని అహర్నిశలు కష్టపడుతున్న వ్యక్తులు వీరు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గెలుపు కోసం నేను ఎక్కువ కష్టపడుతున్నాను. ఎందుకంటే ఐటీ కంపెనీలు ఎక్కువగా భీమిలికే వస్తున్నాయి.

**ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ జీఎంఆర్ :** జీఎంఆర్ ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ. ఇక్కడే మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన పదో తరగతి ఫెయిల్ అయ్యారు. తర్వాత పట్టుదలతో చదివి దేశానికే కాదు.. ప్రపంచానికే అతిపెద్ద పారిశ్రామికవేత్తగా ఎదిగారు. జీఎంఆర్ గారు శంషాబాద్ విమానాశ్రయం నిర్మించాలని భావించినప్పుడు చంద్రబాబు గారికి సందేహం ఉండేది. తర్వాత తన సామర్థ్యం నిరూపించుకున్నారు. చంద్రబాబు గారిని ఒప్పించి ప్రపంచంలో నెం.1 ఎయిర్ పోర్ట్ నిర్మిస్తామని చెప్పారు. అనుకున్నది సాధించారు. ఈ రోజు తెలంగాణ జీడీపీలో 12 శాతం జీఎంఆర్ ఎయిర్ పోర్ట్ అందిస్తోంది. ఎయిర్ పోర్ట్ కు 5వేల ఎకరాలు అవసరమా అని ఆనాడు ఎగతాళి చేశారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ ఏ విధంగా అభివృద్ధి చెందిందో ఈ రోజు వెళ్లి చూడండి. బెంగళూరు, చెన్నైలలో రెండో ఎయిర్ పోర్ట్ నిర్మించే పరిస్థితి. చంద్రబాబు గారి విజన్ వల్ల హైదరాబాద్ కు ఆ అవసరం లేదు. వచ్చే వందేళ్లను దృష్టిలో పెట్టుకుని నిర్మించారు.

**ప్రపంచ సివిల్ ఏవియేషన్ వర్క్ ఫోర్స్ లో 25 శాతం తెలుగువారు ఉండాలనేది లక్ష్యం :** విజన్ అనేది చాలా అవసరం. కొంతమంది విజన్ లెస్ పీపుల్ విజనరీని ఎగతాళి చేస్తారు. చంద్రబాబు గారు రాజుగారిని కలిసిన తర్వాత ప్రపంచ సివిల్ ఏవియేషన్ వర్క్‌ఫోర్స్‌లో 25 శాతం తెలుగువారు ఉండాలనేది లక్ష్యమని చెప్పారు.




ముఖ్యమంత్రిగా నా సహకారం ఉంటుందని చెప్పారు. దేశంలో కనీసం 70శాతం వర్క్ ఫోర్స్ తెలుగువారు ఉండాలన్నారు. చంద్రబాబు గారు తన విజన్ తో ఆదేశాలు జారీ చేశారు. ఒక వరల్డ్ క్లాస్ ఇన్ స్టిట్యూట్ తయారు చేయాలని. ఏదో ఒక యూనివర్సిటీ ఏర్పాటుచేయడం కాదు.. కామన్ ఇన్ ఫ్రాస్టక్చర్, ఎకో సిస్టమ్ క్రియేట్ చేయాలని మేమంతా భావించాం. బెస్ట్ ఇన్ క్లాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీని తీసుకువస్తేనే మన ప్రాంత రూపురేఖలు మారతాయని ఆనాడు మేం తీసుకున్న ఒక నిర్ణయం ఇది.

**వేలాది ఎకరాలు ప్రజల కోసం అందించిన గొప్ప వంశీయులు పూసపాటి వారు :** ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు గురించి ఆలోచిస్తున్న సమయంలో విశాఖ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఒక మ్యాప్ తీసుకుని వచ్చారు. మాన్సాస్ ట్రస్ట్ కు ఉన్న భూముల గురించి వివరించారు. వరల్డ్ క్లాస్ ఇన్ స్టిట్యూట్ ను తీసుకువస్తే మేం ఉచితంగా భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పిన గొప్ప వ్యక్తి అదితి గజపతిరాజు. వేలాది ఎకరాలు ప్రజల కోసం అందించిన గొప్ప కుటుంబం వారిది. అయితే ఎంవోయూ ఫైల్ కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలి. నేను ఫాలో అప్ చేస్తున్నప్పుడు సీఎం సెక్రటరీ గారు నాకు ఫోన్ చేసి ఉచితంగా భూమి ఇస్తున్నారని ఫైల్‌లో ఉందని, ఇది సాధ్యం కాదు అన్నారు. టోకెన్ అమౌంట్ కానీ, రూపాయి అయినా కట్టాల్సి వస్తుందేమో అన్నారు. అదితి గారికి ఫోన్ చేసి చెప్పినప్పుడు రూపాయికి కూడా వారు ఒప్పుకోలేదు. గొప్ప మనసుతో వారు ఉచితంగా భూములు అందించారు. మా బ్లడ్ లోనే ఏవియేషన్ ఉంది అని, మాన్సాస్ పేరు పెడితే చాలని చెప్పారు. ఈ సభాముఖంగా అశోక్ గజపతిరాజు గారికి, అదితి గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుంది :** ఈ ఎడ్యుసిటీ కేవలం దేశానికి, రాష్ట్రానికే కాదు.. ప్రపంచానికే ఒక ఆదర్శంగా నిలవబోతోంది. ఐఎస్ బీ సంస్థ గురించి ఏవిధంగా విన్నారో దానికంటే బెటర్ గా ఉంటుంది. ఏవియేషన్ ఎడ్యుసిటీని ప్రపంచస్థాయి సంస్థగా తీర్చిదిద్దాలని మేం అహర్నిశలు కష్టపడుతున్నాం. ఏపీని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తాం. క్లసర్ విధానంలో ముందుకు వెళ్తాం. వివిధ జిల్లాల్లో 20కిపైగా క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. ఈ క్లస్టర్లలో కేవలం కంపెనీలు తీసుకురావడమే కాకుండా.. మొత్తం ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తాం. ఏవియేషన్ రంగంలో ఒక ఇంజన్ తయారు చేయాలంటే సుమారు వెయ్యి కంపెనీలు వాళ్ల కాంపోనెంట్స్ ఇస్తారు. ఇది వర్టికల్ విధానం. హారిజాంటల్ క్లస్టర్ విధానంలో ఎడ్యుకేషన్. ఏవియేషన్ ఎడ్యుకేషన్ అనేది హారిజాంటల్.

**ఎడ్యుకేషన్ ను ఇండస్ట్రీని ఇంటిగ్రేడ్ చేస్తాం :** ప్రపంచానికే మన టాలెంట్ అందజేయాల్సిన అవసరం ఉంది. ప్రతి క్లస్టర్ లో సిస్టమాటిక్ అప్రోచ్ తో ముందుకు వెళ్తున్నాం. ఎడ్యుకేషన్ ను ఇండస్ట్రీని ఇంటిగ్రేడ్ చేస్తాం. యువకులను జాబ్ రెడీగా తయారుచేసి అందించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. క్లస్టర్ బేస్ అప్రోచ్ మోడల్ ఫాలో అయ్యే ఒకే ఒక దేశం చైనా. క్లస్టర్ బేస్ అప్రోచ్ ఏపీ తీసుకుంటుంది. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే లక్ష్యం. ఇందుకోసం అహర్నిశలు కష్టపడుతున్నాం. అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చాం. ప్రజల సహకారం కూడా చాలా అవసరం.

**99 పైసలకే భూములు ఇవ్వడం వల్ల టీసీఎస్, కాగ్నిజెంట్ వచ్చాయి :** ఫార్చ్యూన్ 500 కంపెనీలకు 99 పైసలకే భూములు ఇస్తామంటే చాలామంది ఎగతాళి చేశారు. ఆ ఒక్కనిర్ణయం వల్ల టీసీఎస్, కాగ్నిజెంట్ వచ్చాయి. రాబోయే వంద రోజుల్లో మరో రెండు ఐటీ కంపెనీలు కూడా విశాఖకు రానున్నాయి. చాలా సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నాం. మంచి మనసుతో ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలు సహకరిస్తారు. ప్రకృతి సహకరిస్తుంది. ఐఎస్ బీ ఏర్పాటుచేసినప్పుడు చాలా మంది సాహసోపేత నిర్ణయం అన్నారు. చంద్రబాబు గారు వెనక్కి తిరిగి చూడలేదు. ఈ రోజు హైదరాబాద్ ఎలా అభివృద్ధి చెందిందో చూశాం. అలాంటి సాహసోపేత నిర్ణయాలు మేం తీసుకుంటాం. మిస్ప్రెల్స్ రెడీ గా ఉన్నాయి. అద్భుతమైన జీపీఎస్ లు కూడా మాకు ఉన్నాయి. మాకు ఏదైనా గైడెన్స్ కావాలంటే టైం టూ టైం ఇస్తారు. కలిసికట్టుగా అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ను నెం. 1గా చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది.

**12 నెలల్లో ఏవియేషన్ ఎడ్యుసిటీని అభివృద్ధి చేస్తాం :** నిన్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గారిని కలిసి స్టూడెంట్ మాక్ అసెంబ్లీ గురించి వివరించాను. బాలల రాజ్యాంగ పుస్తకం గురించి చెప్పాను. దేశవ్యాప్తంగా ఈ మోడల్ ను ఇంప్లిమెంట్ చేస్తామని కేంద్ర మంత్రి చెప్పారు. స్పీకర్ గారి సహకారంతో ఇదంతా చేయగలిగామని చెప్పాను. మిస్ప్రెల్, జీపీఎస్ కు ఓ ఉదాహరణ చెబుతాను. శాసనసభలోనే స్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహణకు నేను విజ్ఞప్తి చేశాను. రూల్స్ అంగీకరించవని అయ్యన్నపాత్రుడు గారు చెప్పారు. అసెంబ్లీ ప్రాంగణంలోనే శాసనసభ సెట్టింగ్ వేసి నిర్వహించాలని చెప్పారు. కొంతమంది ప్రతిపక్ష నేతలకు తాము ఎక్కడ మాక్ అసెంబ్లీ నిర్వహించామో కూడా తెలియదు. మాపై ఆరోపణలు చేశారు. జీపీఎస్ గొప్పతనం ఏంటో అప్పుడు నాకు అర్థమైంది. టీడీపీలో పనిచేయడం మాలాంటి వారికి అదృష్టం. ఓ వైపు సీనియర్స్ గైడెన్స్, ప్రోత్సాహం మాకు దక్కుతోంది. మరోవైపు సీఎం గారు మమ్మల్ని పరిగెత్తిస్తున్నారు. ఉత్తరాంధ్రకు సంబంధించి మరో సెక్టార్ లో యూనివర్సిటీ తీసుకురావాలని భావిస్తున్నామం, ఇందుకు సంబంధించిన గైడెన్స్ కూడా అప్పుడే ఇచ్చారు. ఎడ్యుసిటీ ఏర్పాటులో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు గారి సహకారం కూడా ఎనలేనిది. 12 నెలల్లో ఎడ్యుసిటీని అభివృద్ధి చేస్తామని చెప్పారు.
ఈ కార్యక్రమంలో గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పి. అశోక్ గజపతిరాజు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జీఎంఆర్ సంస్థల ఎయిర్ పోర్ట్స్ ఛైర్మన్ జీబీఎస్ రాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిదో మహిళా గ్రీవెన్స్ విజయవంతం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో "మహిళా గ్రీవెన్స్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు తమ వ్యక్తిగత, కుటుంబ, ఆర్థిక, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ "మంగళవారం అంటే గుంటూరు పశ్చిమ టీడీపీ కార్యాలయం మహిళలతో కళకళలాడుతుంది. మహిళా గ్రీవెన్స్‌ను పూర్తిగా ఓపెన్ వేదికగా నిర్వహిస్తూ, మహిళలు నేరుగా వచ్చి తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తున్నాం. వచ్చిన ప్రతి సమస్యపై సానుకూల దృక్పథంతో స్పందిస్తూ, సాధ్యమైన పరిష్కారాలు, అవసరమైన వర్క్, ఫాలోఅప్స్‌ను చేపడుతున్నాం. మహిళలకు ఒక ఊరట కలిగించడమే కాదు, సమస్యలు పరిష్కరించి వారికి ఆనందం ఇవ్వడమే మా లక్ష్యం" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో మహిళలు సమస్య రహితంగా, ఆర్థికంగా



బలంగా, గౌరవంగా, స్వావలంబనతో ముందుకు సాగాలి అనే సత్సంకల్పంతో ఈ మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఇది తొమ్మిదో గ్రీవెన్స్‌గా విజయవంతంగా కొనసాగుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో మహిళలందరూ సమస్యల నుంచి విముక్తి పొందాలన్న ఆలోచనతో నాయకులు, కార్యాలయ సిబ్బంది టీమ్‌వర్క్‌తో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

# 22 న విజయవాడలో క్రిస్మస్ హై టీ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ )** : విజయవాడలో ఈనెల 22వ తేదీన క్రిస్మస్ హై టీ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ వెల్లడించారు. మంగళవారం తాడేపల్లి లోని న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో హైటీ ఏర్పాట్లపై మంత్రి ఫరూక్ సమీక్షించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముందస్తు వేడుకల్లో భాగంగా హైటీ కార్యక్రమాన్ని విజయవాడలోని ఏ -ప్లస్ కన్వెన్షన్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారని, పొరపాట్లు లేకుండా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని



అధికారులు, సిబ్బందిని మంత్రి ఫరూక్ ఆదేశించారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి ఏ. శేఖర్, మైనార్టీ కార్పొరేషన్ ఎండి యాకుబ్ భాష,వక్ఫ్ బోర్డు సీఈవో మహమ్మద్ అలీ, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ గౌస్ పీర్, మైనారిటీ కమిషన్ కార్యదర్శి నిజాముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

# జీవితాన్ని దేశానికి అంకితం చేసిన వ్యక్తి అటల్ బిహారీ వాజ్ పేయి

- **అటల్ జీ అంటేనే నమ్మకం, అభివృద్ధి సుపరిపాలన**
- **తెలుగుజాతి అటల్ బిహారీ వాజ్ పేయికి రుణపడి ఉంటుంది**
- **ఆర్థికంగా ఎదగడమే కాదు.. నైతిక విలువలు కూడా చాలా ముఖ్యం**
- **నాకు స్ఫూర్తినిచ్చిన నాయకుడు అటల్ బిహారీ వాజ్ పేయి**
- **మచిలీపట్నంలో అటల్ సందేశ్-మోదీ సుపరిపాలన యాత్రలో పాల్గొన్న మంత్రి లోకేష్**
- **భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహం ఆవిష్కరణ**



**మచిలీపట్నం(జర్నలిస్ట్ ఫైల్)** : జీవితాన్ని దేశానికి అంకితం చేసిన వ్యక్తి అటల్ బిహారీ వాజ్ పేయి. అటల్ జీ అంటేనే నమ్మకం, అభివృద్ధి సుపరిపాలన అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఎన్డీయే ఆధ్వర్యంలో నిర్వహించిన అటల్ సందేశ్– మోదీ సుపరిపాలన బస్సు యాత్రలో మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూ హౌసింగ్ బోర్డ్ సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన వాజ్ పేయి కాంస్య విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఈ రోజు వాజ్ పేయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడం, విగ్రహాన్ని ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నా. అటల్ సందేశ్– మోదీ సుపరిపాలన యాత్ర ధర్మవరంలో ప్రారంభమైంది. ఈ నెల 25న అమరావతిలో యాత్ర ముగుస్తుంది. అటల్ జీ గొప్పదనమే కాదు.. ఆయన సమాజానికి చేసిన సేవ, ఆయన నైతిక విలువలపై మాట్లాడుకోవాల్సిన అవసరం ఉంది. స్వర్గీయ ఎన్టీఆర్ గారు, చంద్రబాబు గారిలో ఎవరిని మీరు ఆదర్శంగా తీసుకుంటాని నన్ను చాలా మంది అడిగారు. ఒక మత్స్యకార గ్రామాన్ని అభివృద్ధి చేసిన ఆనాటి సింగపూర్ ప్రధాని లీ క్వాన్ యూ, మొత్తం భారతదేశాన్ని కలిసికట్టుగా ముందుగా తీసుకెళ్లిన అటల్ బిహారీ వాజ్ పేయి గారిని నేను ఆదర్శంగా తీసుకున్నాను.

**అటల్ జీ అంటేనే నమ్మకం, అభివృద్ధి సుపరిపాలన :** సమాజంలో నైతిక విలువలు పెంపొందించేందుకు మేం కృషి చేస్తున్నాను. సమాజంలో నైతిక విలువలు అంటే ఏంటో చూపించిన గొప్ప వ్యక్తి వాజ్ పేయి గారు. ఆయన గురించి ఎవరిని అడిగినా గొప్పగా చెబుతారు. ప్రతిపక్షమే లేని వ్యక్తి వాజ్ పేయి గారు. చిన్నవయసు నుంచే ఆయన జీవితాన్ని కవిత్వానికి, దేశానికి అంకితం చేశారు. 18 ఏళ్ల వయసులోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. దేశం కోసం జైలుకు వెళ్లారు. అటల్ బిహారీ వాజ్ పేయి అంటేనే నమ్మకం, అటల్ జీ అంటేనే అభివృద్ధి, అటల్ జీ అంటేనే సుపరిపాలన. ఆయన మూడుసార్లు ప్రధాని అయ్యారు. మొదటిసారి కేవలం 13 రోజులే ప్రధానిగా ఉన్నారు. మెజార్టీ లేకపోయినా ఎట్టిపరిస్థితుల్లోనూ మద్దతు సాధించాలని కోరుకుంటారు. కానీ నైతిక విలువల కోసం నిలబడ్డారు. తర్వాత ఆయనకు తిరుగే లేకుండా పోయింది.

**దేశ భద్రత, అభివృద్ధికి కృషి చేశారు :** ఫోఖ్రాన్ లో న్యూక్లియర్ టెస్ట్ నిర్వహించారు. దేశ భద్రత కోసమే న్యూక్లియర్ టెస్ట్ అని చెప్పిన గొప్ప వ్యక్తి వాజ్ పేయి గారు. కార్గిల్ లో పాక్ దురాక్రమణను సమర్థంగా తిప్పికొట్టారు. ఈ రోజు ఆయనను మనం స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. ఓ వైపు దేశభద్రత, దేశ అభివృద్ధిని ఆయన ముందుకు తీసుకెళ్లారు. స్వర్ణ చతుర్భుజి తీసుకువచ్చారు. అద్భుతమైన రోడ్లు వేశారు. చంద్రబాబు గారు కోరితే టెలికాం మొత్తం డీరెగ్యులరైజేషన్ చేశారు. అహర్నిశలు కష్టపడి సంస్కరణలు తీసుకువచ్చారు. ఈ రోజు అద్భుతమైన ఎయిర్ పోర్టులు చూస్తున్నామంటే కారణం అటల్ బిహారీ వాజ్ పేయి గారి సంస్కరణలే.

**తెలుగుజాతి అటల్ బిహారీ వాజ్ పేయికి రుణపడి ఉంటుంది :** దేశాన్ని, హిందీని ఎల్లప్పుడూ ప్రేమించేవారు. యునైటెడ్ నేషన్ లో హిందీలో మాట్లాడి స్టాండింగ్ ఓవేషన్ పొందిన గొప్ప వ్యక్తి వాజ్ పేయి గారు. నాకు అటల్ జీ గారిని కలిసే అవకాశం దక్కలేదు. ఆయన గురించి చంద్రబాబు గారి వద్ద తెలుసుకున్నాను. వారిద్దరి మధ్య ప్రేమ చూస్తే ఒక తండ్రికి, కుమారుడికి మధ్య ఉన్న ప్రేమ. ఆనాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ఢిల్లీకి వెళితే.. కుమారుడు వస్తే తండ్రి ఎంత సంతోషపడతారో ఆ విధంగా వాజ్ పేయి గారు ఆనందపడేవారు. 1998లోనే ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడింది. ఈ రోజు హైదరాబాద్ అభివృద్ధికి కారణం వాజ్ పేయి గారు. ఐఎస్ బీ సంస్థ కావాలని చంద్రబాబు గారు కోరితే కలిసికట్టుగా తీసుకువచ్చారు. బీమా నియంత్రణ సంస్థను హైదరాబాద్ లో ఏర్పాటుచేశారు. ఆఫ్రో–ఏషియన్ గేమ్స్ నిర్వహణకు నిధులు కేటాయించిన వ్యక్తి వాజ్ పేయి గారు. తెలుగుజాతి ఆయనకు రుణపడి ఉంటుంది. ఇండియా ఫస్ట్ అనేది వాజ్ పేయి ఆలోచన. దేశాన్ని బలోపేతం చేసేందుకు అహర్నిశలు కష్టపడ్డారు. ప్రధానిగా అనేక సంక్షోభాలు ఎదుర్కొన్నారు. ఏనాడు అధైర్యపడలేదు. కలిసికట్టుగా ముందుకు వెళదామని చెప్పిన గొప్ప వ్యక్తి ఆయన

**వాజ్ పేయి మార్గంలోనే ప్రధాని మోదీ వెళ్తున్నారు :** వాజ్ పేయి గారి మార్గంలోనే ప్రధాని మోదీ గారు వెళ్తున్నారు. ప్రధానమంత్రి గారికి కూడా యువకులంటే చాలా ఇష్టం. వారికి అండగా నిలుస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పొరుగుదేశానికి గట్టిగా బుద్ధి చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తుంటే.. ఏపీలోనే డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ నడుస్తోంది. మోదీ గారిని మనం నమో అని కూడా పిలుస్తాం. నమో అంటే నాయుడు గారు, మోదీ గారి జోడీ నడుస్తోంది. గడిచిన 18 నెలల్లో ఏపీకి పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాయంటే, ఆర్థికంగా కేంద్ర ప్రభుత్వం అండగా నిలిచిందంటే 2024 ఎన్నికల్లో అందరం కలిసి సాధించుకున్న విజయమే కారణం. 175 స్థానాల్లో 164 స్థానాల్లో కూటమి గెలిచింది. ఒక పవిత్ర బాధ్యత మా భుజస్కందాలపై ఉంది. మేం అందరం కలిసికట్టుగా ముందుకు తీసుకెళతాం. రాష్ట్రాన్ని అభివృద్ధి దారిలో పెడతాం. రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది.

**ఆర్థికంగా ఎదగడమే కాదు.. నైతిక విలువలు కూడా చాలా ముఖ్యం :** ఏ మార్గం అయితే అటల్ జీ మనకు చూపించారో ఆ మార్గంలో మనం నడవాలి. ప్రధాని గారు 2047 నాటికి దేశం అభివృద్ధి సాధించాలని చెబుతున్నారు. ఆర్థికంగా ఎదగడమే కాదు.. నైతిక విలువలు కూడా చాలా ముఖ్యం. ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువల గురించి బోధిస్తున్నాం. నైతిక విలువలు లేని సమాజం సమాజమే కాదు. అందుకే అటల్ జీని ఆదర్శంగా తీసుకుని నైతిక విలువలు పెంచుకోవాలి. దేశాన్ని, రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలి. మొదటి విగ్రహం మంగళగిరిలోనే ఏర్పాటుచేస్తామని కోరాను. కార్యక్రమం ముగిసిన తర్వాత వాజ్ పేయి గారి పెద్ద విగ్రహం మంగళగిరి నియోజకవర్గంలో ఏర్పాటుచేస్తాం. నన్ను ఇన్ స్పైర్ చేసిన నాయకుడు అటల్ బిహారీ వాజ్ పేయి గారు. నేను పట్టుదల, కమిట్ మెంట్ తో పనిచేస్తున్నానంటే కారణం వాజ్ పేయి గారు. ఆయన మార్గంలోనే నడుస్తానని మీ అందరికీ హామీ ఇస్తున్నానని అన్నారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, మంత్రి కొల్లు రవీంద్ర, శాసనమండలి బీజేపీ పక్షనేత సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము, బోడె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మాపూర్ చెరువు కాపాడాలి

## యువ నాయకుడు క్యాతం మధు కృష్ణ



శామీర్ పేట, డిసెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : ఫార్మా కంపెనీల రసాయన వ్యర్థాలతో లక్ష్మాపూర్ పెద్ద చెరువు కలుషితమవుతుండటంతో ప్రజలు, రైతులు, పశు పక్షాదులను కాపాడాలని లక్ష్మాపూర్ యువనాయకుడు క్యాతం మధు కృష్ణ కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఆయన ఫిర్యాదు చేశారు. కర్మపట్ల ఫార్మా ఫేజ్%-%3 నుంచి వచ్చిన వ్యర్థాలు చెరువులో కలవడంతో చేపలు మృతి చెందుతున్నాయని, ఆయకట్టు పొలాల్లో పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఇదే నీటిని తాగునీటిగా వినియోగించడంతో గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారని పేర్కొంటూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 15ఎస్ ఎమ్ పి టి 5 ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న యువ నాయకుడు క్యాతం మధు కృష్ణ

## స్వర్ణాంధ్ర ఏ 2047 -పి4 కార్యక్రమంలో కుట్టు మిషన్లు, ఎలక్ట్రికల్ వాహనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట, డిసెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : జగ్గయ్యపేట మండలం, ధర్మవరప్పాడు తండాలోని రామ్‌కో సిమెంట్స్ ఫ్యాక్టరీ ఆవరణలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర ఏ 2047 – పి4 కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు మరియు ఎలక్ట్రికల్ ఆటోలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి రామ్‌కో సిమెంట్స్ ఫ్యాక్టరీ వారు స్పాన్సర్‌గా



వ్యవహరించగా, ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొని లబ్ధిదారులకు కుట్టు మిషన్లు, ఎలక్ట్రికల్ వాహనాలను అందజేశారు ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిన స్వర్ణాంధ్ర ఏ 2047 కార్యక్రమం రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లే మహత్తర ప్రణాళిక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెరిగి, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయని తెలిపారు. రామ్‌కో సిమెంట్స్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినప్పటి నుంచే సిఎస్ఆర్ నిధుల ద్వారా చుట్టుపక్కల గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించడం, మౌలిక సదుపాయాల కల్పనలో ముందుండటం అభినందనీయమని అన్నారు. ప్రత్యేకంగా ఈ రోజు కుట్టు మిషన్లు, ఎలక్ట్రికల్ ఆటోలు అందజేయడం ద్వారా లబ్ధిదారుల జీవనోపాధికి తోడ్పాటు అందిస్తున్నందుకు రామ్‌కో యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు ఇలాంటి ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్య కార్యక్రమాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో మరింత విస్తృతంగా అమలవుతాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో %=ణా% బాలకృష్ణ , ఫ్యాక్టరీ యాజమాన్యం %ూఎ=ఖ% మూర్తిరావు , ఫరూక్ తదితరులు పాల్గొన్నారు

## గ్రామపంచాయతీ రెండవ విడతలో కూడా కాంగ్రెస్ హవా

### డిసిసి అధ్యక్షులు కే.నగేష్ రెడ్డి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

డిసెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మొదటి విడతల సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన విధంగానే రెండవ విడతలో కూడా అత్యధిక స్థానాలు గెలిచి ముందంజలో ఉందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె.నగేష్ రెడ్డి అన్నారు.నగేష్ రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు,చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించడం జరిగింది.ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని నెరవేర్చే విధంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధిలో ముందు ఉంచుతాము.రెండవ విడతలో జరిగిని 196 సర్పంచ్ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు దాదాపు137 స్తనాలు కైవసం చేసుకోవడం జరిగింది.ఇందులో దాదాపు సగం స్థానాలు ఎన్నికల కంటే ముందే కాంగ్రెస్ అభ్యర్థులకు ఏకగ్రీవం అయ్యాయి.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో ప్రజాపాలన ఎంత విజయవంతంగా చేస్తున్నారో ప్రజలు ఏ విధంగా కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉన్నారో తెలపడానికి ఇదే నిదర్శనం.ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు తెలుపుతూనే ఇందుకు సహకరించిన కాంగ్రెస్ నాయకులకు,ఓటు వేసి కాంగ్రెస్ నాయకులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## భీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని పెంచాలనే నిర్ణయాన్ని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండిస్తోందని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా వెల్లడించారు

అబిడ్స్ (జర్నలిస్ట్ ఫైల్) : భీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని పెంచాలనే నిర్ణయాన్ని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండిస్తోందని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు.ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ రంగం లాభాల కంటే ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈనెల 12వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర మంత్రివర్గం ప్రో క్యాపిటల్ ఆర్థిక సంస్కరణలకు ఆమోదం తెలిపిందన్నారు. భీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 100% పెంచడం సరైన నిర్ణయం కాదన్నారు. 1999లో ఐఆర్డిఏ) బిల్లును ఆమోదించడం ద్వారా భీమారంగాన్ని జాతీయకరణ నుండి విముక్తి చేశారన్నారు. అప్పటినుండి విదేశీ బాగా సామ్యాలతో కూడిన అనేక ప్రైవేట్ బీమా సంస్థలు జీవిత బీమా మరియు సాధారణ భీమా రంగంలో తమ కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు ఈ సంస్థలకు వ్యాపార నిర్వహించడానికి మూలధనం ఎప్పుడు సమస్యగా లేదన్నారు. బీమా సంస్థలు వినియోగిస్తున్న మొత్తం మూలధనంలో ఎఫ్డిఐ వాటా కేవలం 32 శాతం అని గుర్తు చేశారు ఇలాంటి పరిస్థితుల్లో భీమా రంగంలో ఎఫ్డిఐ పరిమితిని నూరు శాతం పెంచి విదేశీ మూలధనానికి సంపూర్ణ స్వేచ్ఛ ఇవ్వడం తగదన్నారు ఇది భారత దేశ ఆర్థిక వ్యవస్థ పైనే ప్రభావం చూపుతోందన్నారు ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే గమనించి తమ నిర్ణయాన్ని పునర్ సమీక్షించుకోవాలన్నారు అప్పటి వరకు తమ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు

# మున్నూరు కాపు జిల్లా నాయకులకు రాష్ట్ర అధ్యక్షుడి దిశానిర్దేశం



శామీర్ పేట, (జర్నలిస్ట్ ఫైల్) : మేడ్చల్ –మల్కాజ్గిరి జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన వేల్పుల శ్రీనివాస్ పటేల్, ప్రధాన కార్యదర్శిగా చాట్లపల్లి నర్సింగరావు పటేల్ లు రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్ను మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గంలో మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి మున్నూరు కాపు పెద్దలను కలసి పూర్తి స్థాయి కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసి జాబితా పంపాలని దిశానిర్దేశం చేశారు. తదుపరి పరిశీలన అనంతరం పూర్తి స్థాయి జిల్లా కార్యవర్గాన్ని ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడు తోట నరేష్ పటేల్, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు పలువుల రాజు పటేల్, ఘట్కేసర్ మండల అధ్యక్షుడు కాటికం లక్ష్మణ్ పటేల్, మౌలాలి హౌసింగ్ బోర్డ్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ పటేల్, నాచారం సంఘం పెద్దలు ఆకుల మల్లేష్ పటేల్తో పాటు పలువురు మున్నూరు కాపు కుల సంఘము నాయకులు పాల్గొన్నారు. 15ఎస్ ఎమ్ పి టి 6 మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తంని సన్మానిస్తున్న నూతన కమిటీ

# అరాచకాన్ని ప్రోత్సహించటమేనా వైసీపీ ఎజెండా....

### జగనన్న ఉండగా నేరస్తులు అందరికీ పండుగే....

### నీచులను వెనకేసుకొస్తున్న జగన్....

### రాష్టం పట్ల సమాజం పట్ల జగన్కు ఏ బాధ్యత ఉందా?....

### టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్లరమేష్



అమరావతి డిసెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : ఒక హంతకుడికి సంఘీభావం తెల్పడం బహుశా చరిత్రలో మనం ఎక్కడ చూసి ఉండవేమోనని, పల్నాడు వల్లకాడు చేసిన దుర్మార్గుడికి సంఘీభావం అంటూ వైసీపీ హంతకులను ప్రోత్సహిస్తూ దిగజారిపోయిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ విమర్శించారు అమరావతిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిరాతంగా హత్య చేసి సుప్రీంకోర్టు చీవాట్లతో లొంగిపోవడానికి వెళ్తూ బలప్రదర్శన చేయడానికి సిద్ధం అయ్యారని. అడ్డుకున్న ప్రభుత్వంపై రెడ్ బుక్ రాజ్యాంగం అని ఏడవటం వైసీపీ నీచ రాజకీయాలకు అంగా లేకుండా పోయిందని ఆయన విమర్శించారు అరాచకవాది జగన్మోహన్ రెడ్డి అండతో మరో అరాచకవాది పిన్నెల్లి ఐదేళ్లు పల్నాడుని వల్లకాడుగా మార్చాడని. తనుకు ఎదురు చెప్తే ఎవరైనా సరే అతి కిరాతకంగా నరికి చంపాడని. పల్నాడు నరరూప రాక్షసుడైన పిన్నెల్లి రామకృష్టారెడ్డిని చట్టపరంగా ఉరి తీసినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని పల్నాడుమొత్తం ఎదురుచూస్తోందని తెలిపారు గత ఐదేళ్ల పిన్నెల్లి పాలనలో 8 హత్యలు, 79 దాడులు జరిగాయి. బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీలపై దాదాపు 51 దాడులు జరిగాయని. అటువంటి రాక్షసుడు మంచివాడా ? అని ఆయన ప్రశ్నించారు గత ప్రభుత్వంలో శవాన్ని సొంతూరు కూడా తీసుకెళ్లలేని పరిస్థితి పల్నాడులో ఉందంటే శాంతి భద్రతలు అదుపుతప్పాయో అర్థం చేసుకోవాలని. పిన్నెల్లి నరహంతకులు చేసిన హత్యా రాజకీయాలపై సుప్రీంకోర్టే అవాక్కు అయిందని. కోర్టు దృష్టిలో నేరస్తులు వైసీపీ ముఠాకి వాళ్ళ నాయకుడికి మాత్రం మంచివారిగా కనిపిస్తున్నారని ఆయన తెలిపారు 'జై జగన్' అనలేదని తోట చంద్రయ్యను పీక కోసేశారని జల్లయ్యని పొట్టన పెట్టుకున్నారని, తురకా కిషోర్ వంటి రాక్షసులను తయారు చేసి ప్రజల మీద వదిలేసి, వారి ఆర్తనాదాల మధ్య జగన్మోహన్ రెడ్డితో కలిసి సైకో ఆనందం పొందిన నీచులు పిన్నెల్లి సోదరులని ఆయన మండిపడ్డారు బడుగు బలహీన వర్గాలను హింసించి, హతమార్చి ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేసారని. వాళ్ళు మనుషులు కదా? నరహంతకులను వెనకే సుకునే జగన్మోహన్ రెడ్డి కి కనీసం మానవత్వం లేదా అని ఆయన ప్రశ్నించారు అధికార మతంతో చేసిన నేరాలు ఘోరాలు శాపాలుగా వెంటాడుతున్నప్పుడు. అక్రమ కేసులని సానుభూతి కోసం టాపిక్ డైవర్షన్ రాజకీయాలు చేయడం వైసిపికే చెందుతుందని ఆయన విమర్శించారు మాచర్లలో ప్రజలు రాక్షసుడు పేడ వదిలిందని సంబరాలు చేసుకుంటుంటే ప్రజలు సంతోషంగా ఉంటే చూసి జగన్ రెడ్డి తట్టుకోలేకపోతున్నాడని ఆయన మండిపడ్డారు ఒక హంతకుడికి పాపం పండి కోర్టు ఆదేశాల ద్వారా అరెస్టు అయితే అక్కనుమ నిర్బంధన అంటున్నా వైసీపీకి కోర్టు అంటే లెక్క లేదా ప్రజాస్వామ్యం పట్ల గౌరవం లేదా? జగన్మోహన్ రెడ్డి ఇలాంటి సైకో నాయకులు రాష్ట్రంలో ఉండటం రాష్ట్రానికి ప్రమాదకరమని ఆయన మండిపడ్డారు

**నీచులను వెనకేసు కొస్తున్న జగన్ రెడ్డి ....**

హత్యలు కుట్రలు కుతంత్రాలు అల్లర్లు చేసే వారిని వైసిపి పదవులు ఇచ్చి మరీ ప్రోత్సహించడం జగన్ రెడ్డికి అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు డ్రగ్స్ దందా నడిపిస్తూ యువత భవిత నాశనం చేసిన కొండారెడ్డి డ్రగ్స్ తో ఈగల్ టీం కి అడ్డంగా దొరికిపోయిన వాటిని వెనకేసుకొస్తున్నాడని ఆయన విమర్శించారు నకిలీ మద్యము కుట్ర చేసి ప్రభుత్వమై బురద జల్లే కేటుగాళ్లను జగన్ సమర్థిస్తాడని ఆయన విమర్శించారు ఐదేళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకుని నకిలీ మద్యంతో 30 వేల మంది ప్రాణాలు బలిగొన్న హంతకులని జగన్ అమాయకులని అంటున్నాడని ఆయన విమర్శించారు ఒక దళితుడిని కిడ్నాప్ చేసి కిరాతకంగా హింసించిన గన్నవరం కూడా గుండా జగన్మోహన్ రెడ్డికి అందగాడిగా కనిపిస్తున్నాడని ఆయన విమర్శించారు దేవుడి ప్రసాదాన్ని కల్తీ చేసిన కల్తీ గాళ్లను మంచివారు అంటారా? అని ఆయన విమర్శించారు దేవుడి సొమ్ము దొంగతనం అనే మహా పాపాన్ని చిన్న దొంగతనంగా జగన్ కొట్టి పడేసాడని ఆయన విమర్శించారు. రప్పా రప్పా బ్యానర్లతో ర్యాలీ చేసి జగన్ నేరం మనస్తత్వాన్నీ నిరూపించుకున్నాడని ఆయన విమర్శించారు హంతకులను గంజాయి బ్యాచ్ ని బెట్టింగ్ బ్యాచ్ ని. చివరకు దిగజారి మహిళలని. వేధించిన వాళ్లని కూడా జగన్ పరామర్శించాడని ఆయన విమర్శించారు అధికారం కోల్పోయి ఖాళీగా ఉంటున్న జగన్ రెడ్డి "జగనన్న ఉండగా నేరస్తులు అందరికీ పండుగే" అన్న భరోసా సిగ్గులేకుండా కల్పిస్తున్నాడని ఆయన విమర్శించారు రాష్ట్రం పట్ల సమాజం పట్ల జగన్ రెడ్డికి ఏ బాధ్యత ఉండదు స్వార్థము మోసము నేరము ద్రోహం ఈ నాలుగింటికి రూపమే జగన్ అని పాతర్ల రమేష్ మండిపడ్డారు

# అస్తవ్యస్తంగా కొత్త డివిజన్ల ఏర్పాటు..

## మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి..



శేరిలింగంపల్లి డిసెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్):కొత్త గా ఏర్పడిన డివిజన్ ల ఏర్పాటులో శాస్త్రీయంగా లేకుండా ఉన్నాయని రీకార్డులలో లేని మురికి కాలువలను హద్దులుగా చూపించారు.సుప్రీం కోర్టు కేసులో



ఉన్న ప్రభుత్వ భూమిలో రోడ్ లేకున్నా రోడ్ ఉన్నట్టు హద్దులు చూపించారు. కాలనీలను రెండుగా చీల్చి హద్దులుగా నిర్ణయించారు.బస్తీలన్నీ ఒక డివిజన్ గా ,కాలనీ లన్నీ ఒక డివిజన్ గా విడదీశారు. ఒక డివిజన్ కు తక్కువ జనాభా, ఒక డివిజన్ కు ఎక్కువ జనాభా ను చూపించారు..అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు అధికారులు సహకరిస్తున్నారు.అభ్యంతరం తెలపడానికి కనీసం మాప్ లను కూడా ఇవ్వడం లేదని మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి మాట్లాడుతూ అస్తవ్యస్థంగా,ప్రజలకు వ్యతిరేకంగా,అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు అనుకూలంగా అధికారులు మరియు ప్రభుత్వ తీరును నిరసిస్తూ , డివిజన్ల ఏర్పాటును తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆర్.ఎస్ పార్టీ తరపునశేరిలింగంపల్లి స్థానిక నాయకులతో కలిసి జి హెచ్ ఎం సి కమిషనర్ కర్ణన్ కి చందానగర్ సర్కిల్ 21 డిప్యూటీ కమిషనర్ శశిరేఖ ని కలిసి డివిజన్ల ఏర్పాటుకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ లిఖితపూర్వకంగా ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మిద్దెల మల్లారెడ్డి ,రోజా,అల్లావుద్దీన్,గౌస్,అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నరసాపురం నుంచి చెన్నై ట్రైన్ కు జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర మంత్రి భూపాతిరాజు శ్రీనివాసవర్మ

### నరసాపురంలో సందడి చేసిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము..



నరసాపురం, డిసెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :నరసాపురం నుంచి చెన్నై సెంట్రల్ వందేభరత్ ట్రైన్ సర్వీస్ ను కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ప్రభుత్వ విప్ నాయకర్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం నరసాపురం రైల్వే స్టేషన్ లో లాంచనంగా ప్రారంభించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు,భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు, మాజీ మంత్రులు. కనుమూరి బాపిరాజు, పీతల సుజాత, పశ్చిమగోదావరి జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు. కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ,విప్ నాయకర్ కూటమి శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే రాము పాల్గొన్నారు.





అనంతరం ట్రైన్ ప్రారంభోత్సవ సభలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, మంత్రి నిమ్మల రామానాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, భీమవరం ఎమ్మెల్యే పులవర్తి అంజిబాబు, నరసాపురం నాయకర్, మాజీ మంత్రులు కనుమూరి బాపిరాజు, పీతల సుజాత,



తదితర ప్రముఖులతో కలిసి రాము వేదిక పంచుకొని ప్రసంగించారు. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మతో రాజకీయ ప్రముఖులతో కలిసి నర్సాపూర్ నుండి గుడివాడ వరకు వందేబారత్ రైలులో ప్రయాణించారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో వందేభారత్ రైలు గుడివాడ చేరుకోవడంతో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులతో పాటు గుడివాడ పట్టణ ప్రజలు వందేభారత్ ట్రైన్ కు స్వాగతం పలికారు.

# గతంలో అభివృద్ధి చేశాను ఇప్పుడు కూడా చేస్తాను

## సర్పంచ్ అభ్యర్థి ఆకుల భద్రప్ప



గజ్వేల్ నియోజకవర్గం, డిసెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : సిద్దిపేట జిల్లా కుకునూరు పల్లి మండలం తిప్పారం గ్రామపంచాయతీ సర్పంచ్ బరిలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన ఆకుల భద్రప్ప సోమవారం నాడు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజాసేవ లక్ష్యంగా ముందుకు సాగుతామని, గతంలో సర్పంచిగా పనిచేసిన అనుభవం తనకు ఉందని, సర్పంచ్ గా పనిచేసిన కాలంలో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచామని, సబ్ స్టేషన్, గ్రామంలో అన్ని వీధులలో సిసి రోడ్లు, వీధి దీపాలు, వైకుంఠధామం, ఫంక్షన్ హాల్ లాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు గ్రామంలో నిర్వహించామని తెలిపారు. గ్రామస్తుల కోరిక మేరకే సర్పంచ్ అభ్యర్థిగా ముందుకు వచ్చానని, సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామ సర్పంచిగా గెలిపిస్తే గ్రామానికి అవసరమగు మౌలిక సదుపాయాలతో పాటు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. గ్రామస్తులందరూ ముఖ్యంగా యువత, మహిళలు మీ అమూల్యమైన ఓటు ఉంగరం గుర్తుపై వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# మక్త మహబూబ్ పేట్ లో ప్రమాదకరంగా మారిన పోల్స్ పరిశీలన..



శేరిలింగంపల్లి డిసెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని మియాపూర్ డివిజన్ లో గల మక్తా మహబూబ్ పేట్ గ్రామంలో చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు పురాతనమై పక్కకు వంగిపోగా మరో చోట రోడ్డు మధ్యలో ఉందనీ ప్రమాదభరితంగా మారాయనీ వీటి స్థానంలో కొత్త పోల్స్ వేయాలని గ్రామస్తులు అధికారులకు పిర్యాదు చేయగా స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు సోమవారం రోజు గ్రామంలో పర్యటించి వాటిని పరిశీలించారు. త్వరలోనే వీటిని మారుస్తామని అధికారులు తెలిపినట్లు బిజెపి సీనియర్ నాయకులు గుండె గణేష్ ముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమం లోలైన్ ఇన్స్పెక్టర్ రమేష్, లైన్ మెన్ పవన్, జాజేరావు శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు గెలిచిన సర్పంచులకు బీఆర్ఎస్ పార్టీ భరోసా



(జర్నలిస్ట్ ఫైల్) డిసెంబరు 16 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు మాట్లాడుతూ: "ప్రతి జిల్లాకు ఒక లీగల్ సెల్ ఏర్పాటు చేసి, గెలిచిన సర్పంచులకు పూర్తి మద్దతుగా నిలుస్తాం. కాంగ్రెస్ నాయకులు బెదిరింపులు, కేసులు పెట్టే కుట్రలు చేస్తున్నా, మీరు భయపడాల్సిన అవసరం లేదు. మీకు రావాల్సిన నిధులు మోదీ గానీ, రేవంత్ గానీ ఆపలేరు – అది మీ హక్కు ఈ ప్రభుత్వం ఇంకా రెండున్నర ఏళ్లు మాత్రమే ఉంది తర్వాత మళ్లీ మన ప్రభుత్వం వస్తుంది – అన్నింటికీ మద్దతుగా నిలుస్తాం ఏ సమస్య వచ్చినా పార్టీ కార్యాలయానికి వచ్చేయండి మన లీగల్ సెల్, నాయకులు అండగా ఉంటారు కేటీఆర్ గారి పిలుపు మేరకు ప్రజలతో కలిసి పనిచేసే ప్రతి సర్పంచ్‌కి మా పార్టీ పూర్తిగా అండగా ఉంటుంది. అభివృద్ధిని అడ్డుకునే కుట్రలను తిప్పికొడతాం

## సచివాలయాల డ్రైన్ల పరిశుభ్రతపై దృష్టి పెట్టండి



○ నగర కమిషనర్ ఆదేశం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :గుంటూరు నగరంలో మైక్రో ప్యాకెట్స్ వారీగా ప్రతి సచివాలయం పరిధిలో డ్రైన్ల శుభ్రంపై ప్రజారోగ్య అధికారులు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం అమరావతి రోడ్, నగరాలు, రెడ్డిపాలెం, నాయడుపేట, విద్యా నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికులు మధ్యాహ్నం సమయంలో తప్పనిసరిగా డ్రైన్లు శుభ్రం చేయాలన్నారు. అమరావతి రోడ్ లోని ప్రియా గార్డెన్స్ దగ్గర డ్రైన్ లో వ్యర్ధాలు నిలిచి ఉండడం గమనించి, సంబందిత కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసి, శానిటేషన్ కార్యదర్శుల వారీగా డ్రైన్ల శుభ్రంకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అన్నపూర్ణ నగర్ లో పర్యటించి, ఆర్డీపీ మేరకు 40 అడుగుల రోడ్ విస్తరణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. విద్యా నగర్ లోని పోలీస్ క్వార్టర్స్ దగ్గర డ్రైనేజి సమస్య పరిష్కారానికి, మరో ప్రాంతంలో రోడ్ లెవల్ కంటే ఎక్కువ ఎత్తులో నిర్మాణం చేసిన కల్వర్ట్ ని తొలగించి నూతన కల్వర్ట్ నిర్మాణంకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటన గుంటూరు డిసిఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, సిటి ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, డిఈఈ రమేష్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఐఎస్ఓ సర్టిఫికేట్ సమిష్టి కృషికి లభించిన అరుదైన గౌరవం



○ తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** మండల రెవిన్యూ కార్యాలయం ఐఎస్ ఒ, సర్టిపికేట్ సాధించడం వెనుక తనతొ పాటు తమ సిబ్బంది అందించిన సహకారం ఎంతైనా ఉందని,డిసెంబర్ 15వ, తేదీ రెవిన్యు విభాగం చరిత్రలో నిలిచే గొప్పశుభదినమని మండల తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ తమ ఆనందాన్ని సిబ్బందితొ పంచుకున్నారు.

స్ధానిక మండలరెవిన్యు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ మాట్లాడుతు ఆధునీకరించిన తమ కార్యాలయ ప్రారంభ కార్యక్రమానికి, ఎంతొ అభిమానంతో హాజరైన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. అదే విధంగా కార్యాలయానికి లభించిన, ఐఎస్ఒ గుర్తింపును మంత్రి వర్యులు నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా అందుకోవడం తమ సుధీర్గకాల ఉద్యోగ పర్వ చరిత్రలొ, ఓ మైలురాయిగా నిలిచిపోయె అంశమని అన్నారు. మండల గ్రామాల నుండి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు, సకాలంలో తమద్వారా అందాల్సిన సేవలను అందించామని అన్నారు. అదే విధానంతొ, కార్యాలయ సిబ్బంది సహకారంతొ తమ వంతుగా సేవలు అందిస్తామన్నారు. కార్యాలయానికి లభించిన అరుదైన గౌరవం క్రమంలొ, తెలుగు రాష్ట్రాలలోని రెవిన్యు విభాగం దృష్టి, తెనాలి వైపుకు చూస్తుందని తమకున్న సమాచారమని, ఆగౌరవం పదిలంగా పదికాలాలు ఉండేలా, తనకు తెనాలితొ అనుబంధం ఉన్నంతవరకు, విధి నిర్వాహణలో, అలసత్వ ధొరణి ఉండదని, అందరి అభిమాన పాత్రుడిగా ఉద్యోగ జీవనం కొనసాగలన్న భావనను వ్యక్తం చేశారు.ప్రతి ఒక్కరి సహకారం ఈ అరుదైన గౌరవానికి కారణమన్నారు. ఈసమావేశంలొ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అమరావతిలో అటల్జీ శతజయంతి వేడుకలు జయప్రదం చేద్దాం



○ అడపాసంపత్ రాయుడు

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** అవినీతికి తావులేని అభ్యుదయ పాలన అందించిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయ్ ఆశయాలను ప్రధాని నరేంద్రమోదీ ముందుకు తీసుకువెళుతున్నారని వాజెపాయ్ శతజయంతి ఉత్సవాలు అదే తరహాలో కొనసాగుతున్నాయని, పట్టణ బిజెపి సీనియర్ నాయకులు అడపా సంపత్ రాయుడు పేర్కొన్నారు. మంగళవారం సంపత్ రాయుడు మీడియా సమావేశంలొ మాట్లాడుతు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయ్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా, ఈనెల 25వతేది, రాజధాని అమరావతి నగరంలొ మాజీ ప్రధాని అటల్ బిహారి వాజెపాయ్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అటల్జీ విగ్రహాన్ని ఆవిష్కరించే, కార్యక్రమం జయప్రదం చేయడంలో బిజెపి శ్రేణులంతా సంఘటితం కావాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలలో అటల్ జీ, విగ్రహాలను ఆవిష్కరించే విధానాన్ని, రాష్ట్ర పార్టీ అద్యక్షులు పివిఎమ్ మాధవ్ నాయకత్వంలో కొనసాగుతుందని అన్నారు. ఈనెల 25 న,రాజధానిలో నిర్వహించె అటల్జీ శతజయంతి వేడుకలకు తరలివెళదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## 39వ డివిజన్ టీడీపీ నేతలతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖాముఖి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం 39వ డివిజన్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ సన్నద్ధతపై ఆమె విస్తృతంగా వివరించారు.

డివిజన్ స్థాయి నుంచే కమిటీల్లో మార్పులు చేపట్టి, కొత్త నాయకత్వానికి అవకాశం కల్పించడంతో పాటు పాత అనుభవాలను సమన్వయం చేస్తూ పూర్తి స్థాయిలో షఫ్లింగ్ చేశామని ఆమె తెలిపారు. ప్రతి డివిజన్‌తో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తూ, కార్యకర్తలకు పరిచయ వేదికలుగా ఈ కార్యక్రమాలను రూపకల్పన చేశామని చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకొని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం మొత్తం క్లీన్ స్వీప్ చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. కార్యకర్తలను సన్నద్ధం చేయడమే కాకుండా ఆయా డివిజన్లలోని స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. "మన పనితోనే గుర్తింపు తెచ్చుకోవాలి" అనే నినాదంతో కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నామని అన్నారు.

పదవులు రాకపోవడం లేదా వ్యక్తిగత కారణాలతో కొందరు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని, అలాంటి వారందరికీ నేరుగా అవకాశం కల్పించేందుకే ఈ ముఖాముఖి కార్యక్రమాన్ని డిజైన్ చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేను నేరుగా కలిసి తమ ఆర్థిక, సామాజిక, మానసిక సమస్యలు ఏవైనా చెప్పుకునే వేదిక ఇదేనని, వాటి పరిష్కారానికి తాను పూర్తిగా సహకరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ మహమ్మద్ రఫీ, గుంటుపల్లి గురువయ్య, సింగంశెట్టి వీరయ్య, అబ్దుల్ ఖాదర్ బుడే, రుస్తుం బాబు, రఫీతో పాటు టీడీపీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందన వనరుల పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత

○ గుంటూరు జిల్లా కలెక్టర్ పిలుపు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :ఇందన వనరుల పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. జాతీయ ఇందన వనరుల పొదుపు వారోత్సవాలలో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీని మంగళవారం కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారీయా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తో కలసి ప్రారంభించారు. ఇందన పరిరక్షణ , పొదుపు చిట్కాల ప్రచార పోస్టర్లును ఆవిష్కరించి, ఇందన వనరులను పొదుపు పాటిస్తామని, వృధాను అరికడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందన వనరుల పొదుపు పాటించటం వలన భవిష్యత్తు తరాలకు ఇందన భద్రత భరోసా కల్పించటం సాధ్యం అవుతుందన్నారు. విద్యుత్ ను పొదుపుగా వినియోగించటం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వలన వచ్చే కార్బన ఉద్గారకాలను తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. ఇందన వనరుల ఉత్పత్తిని తగ్గించటం వలన వీటికి వినియోగించే బొగ్గు, గ్యాస్, క్రూడ్ అయిల్ వంటి శిలాజ ఇందనాలు, సహజ వనరులను కాపాడుకోవచ్చని వివరించారు. జాతీయ ఇందన వనరుల వారోత్సవాలు ప్రతి సంవత్సరం డిసెంబరు 14వ తేది నుంచి 20 వ తేది వరకు నిర్వహించటం జరుగుతుందన్నారు. వారోత్సవాలలో విద్యుత్ వంటి ఇందన వనరులను వృధా చేయకుండా పొదుపుగా వినియోగించటం పై ప్రజలకు ముఖ్యంగా మహిళలకు, విధ్యార్ధులకు, యువతకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. కార్యాలయాలతో పాటు, ఇంటిలోను అవసరం లేనప్పుడు తప్పనిసరిగా లైట్లు, ఫ్యాన్లు ఆపివేయాలన్నారు. విద్యుత్ తక్కువగా వినియోగించే స్టార్ రేటింగ్ ఎలక్ట్రానిక్ గృహోపకరణాలను, ఇతర ఉపకరణాలను మాత్రమే వినియోగించాలన్నారు. సోలార్ వంటి పునరాత్పక ఇందన వనరుల వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యధిక ప్రాధాన్యతతో ప్రతి ఇంటిపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు రూఫ్ టాప్ సోలార్ పధకం ద్వారా రాయితీలు అందిస్తున్నారని చెప్పారు. విద్యుత్ పొదుపు చేయటంలోను ,వృధాను అరికట్టడంలో ఇతరులకు ఆదర్శంగా ఉండేలా ప్రజల్లో మార్పు రావాలని ఆకాక్షించారు. ఎనర్జీ ఎఫిషియన్స్ లో దేశంలోనే రాష్ట్రం అవార్డు సాధించందని, ఇదే స్పూర్తిని కొనసాగించాలన్నారు. ర్యాలీలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, సీపీడీసీఎల్ ఎస్ఈ చల్లా రమేష్, సీఆర్డఏ సర్కిల్ ఎస్ఈ ఎం శ్రీనివాసరావు, ఈఈ కే సత్యనారాయణ, డీఈలు శ్రీనివాసబాబు, నాగేశ్వరరావు, జె హరిబాబు , సూర్యప్రకాష్, ఎస్ఏఓ రామిరెడ్డి, ఏడీఈలు బి రాజమోహనరావు, ఎన్ గురవయ్య, ముస్తాక్ అహ్మద్, జి సురేష్ బాబు, రమేష్, కే సాంబశివరావు, సీపీడీసీఎల్, సీఆర్డీఏ సర్కిల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు - రూ.4.86 లక్షల అపరాధ రుసుము



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మంగళవారం విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాలు సంయుక్తంగా ఫిరంగిపురం సెక్షన్ పరిధిలోని గరుడాచలపాలెం, 113 తాళ్లూరు, మెరికపూడి, మునగపాడు, వేములూరిపాడు గ్రామాలలో విస్తృత తనిఖీలు నిర్వహించాయి. సీఆర్డీయే పర్యవేక్షక ఇంజనీర్ ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 37 బృందాలుగా 37 మంది అధికారులు, 111 మంది సిబ్బంది పాల్గొని 2250 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. ఈ వివరాలను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.ఏ. కరీమ్ (డీపీఈ) మరియు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై. ఏడుకొండలు సంయుక్త ప్రకటనలో తెలిపారు.

తనిఖీలలో మీటరు లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 4 మందికి రూ. 0.04 లక్షలు, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ వినియోగించిన 6 మందికి రూ. 1.10 లక్షలు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీలో వినియోగించిన 3 మందికి రూ. 0.07 లక్షలు, అనుమతించిన లోడ్‌కు మించి వినియోగించిన 33 మందికి రూ. 3.65 లక్షల అపరాధ రుసుములు విధించారు. మొత్తం రూ. 4.86 లక్షల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.

విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టం ప్రకారం జరుగుతాయని, మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేలా వినియోగదారులు చూసుకోవాలని అధికారులు సూచించారు. సీలు లేకపోయినా, ఉద్దేశపూర్వకంగా తొలగించినా విద్యుత్ చౌర్యంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మొదటి సారి తప్పిదానికి కాంపౌండింగ్ విధానంలో అపరాధ రుసుము చెల్లిస్తే విముక్తి కలుగుతుందని, రెండోసారి తప్పిదానికి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతామని తెలిపారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812263, 9440812360 నెంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

## సైనిక త్యాగాలను స్మరిస్తూ అమరవీరుల కుటుంబాల మద్దతుకై విరాళాల సేకరణ



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్) :** మైదుకూరులో ఫ్లాగ్ డే సందర్భంగా విరాళాల సేకరణలో శ్రీ బాలశివ డిగ్రీ కళాశాల ఎన్ సి సి విద్యార్థులు కడప 30వ ఆంధ్ర బెటాలియన్ ఎన్సిసి కమాండింగ్ అధికారి ఆదేశాల మేరకు మైదుకూరులోని వనిపెంట రోడ్ లో ఉన్న శ్రీ బాలశివ యోగేంద్ర మహారాజు డిగ్రీ కళాశాలఎన్సిసి సిటీవో భూమిరెడ్డి రవికళ్యాణ్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా కళాశాలలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఫ్లాగ్ డే సందర్భంగా ఎన్సిసి క్యాడెట్లు స్వచ్ఛంద విరాళాలు సేకరించడం జరిగింది. తదుపరి మైదుకూరు పట్టణ ప్రాంతాలలోవిరాళాల సేకరణలో శ్రీ బాలశివ డిగ్రీ కళాశాల ఎన్ సి సి విద్యార్థులు సేకరించారు. ఈ సందర్భంగా సిటిఓ భూమిరెడ్డి రవి కళ్యాణ్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికుల ధైర్య సాహసాలను త్యాగాలను స్మరించుకోవడం సైనికుల పట్ల కృతజ్ఞత సంక్షేమానికి నిధులు సేకరించడం దేశ సేవలో మైదుకూరు పట్టణ ప్రజలు వ్యాపారస్తులు ఉద్యోగస్తులు అడుగడుగున విరాళాలు ఇవ్వడం మైదుకూరు పట్టణ ప్రజలకు దేశ సేవలో మంచి అవకాశం లభించిందని భారతదేశంలో ఫ్లాగ్ డే అంటే ప్రధానంగా సాయుధ దళాల పతాక దినోత్సవం దీనిని ప్రతి సంవత్సరం డిసెంబర్ 7వ తేదీ జరుపుకుంటారని ఆ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సైనికుల త్యాగాలను గౌరవించడానికి యుద్ధంలో వికలాంగులు మరియు అమరవీరుల కుటుంబాలకు మద్దతు ఇవ్వడానికి జాతీయ పతాకాన్ని ధరిస్తారని విరాళాలు సేకరించడం జరుగుతుందని దేశ సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికుల ధైర్య సాహసాలను త్యాగాలను స్మరించుకోవడం సైనికుల సంక్షేమానికి నిధులు సేకరించడం యుద్ధంలో కుటుంబాలకు సహాయం చేయడం సైనికుల పట్ల కృతజ్ఞత చూపించడానికి వారి సంక్షేమానికి తోడ్పడడానికి ప్రజలకు ఒక అవకాశం వచ్చిందని అందులో భాగంగానే మైదుకూరులో ఎన్సిసి విద్యార్థుల ఆధ్వర్యంలో మైదుకూరు పట్టణంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు.దేశ రక్షణలో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందిస్తున్న సైనికుల సంక్షేమం ఆర్మ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ప్రాముఖ్యతను వివరిస్తూ, సైనికుల త్యాగానికి గుర్తుగా ఇస్తున్న ఈ విరాళం ఎంతో విలువైనదని సేకరించిన విరాళాలను జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయానికి అందజేస్తామని తెలిపారు.

## ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఎస్సార్ శంకరన్ హాల్లో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యేసు బోధనలు, ప్రేమతత్వం దయా గుణం వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పార్థసారథి, పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.

## క్రీడాస్పూర్తినిచాటి ప్రధమంగా నిలచిన ఎనిమది పదుల కుర్రాళ్ళు ఆఇద్దరు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** కొంతమంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్దులని యువశక్తిని మేల్కొపే దిశగా సినిమాకవి రాసిపాటకు భిన్నంగా, ఆగ్రామంలోని, ఇద్దరు వృద్దులు వయోభారాన్ని వెనక్కి నెట్టి, క్రీడాస్పూర్తిని చాటుతూ, ఎనభయ్యొ పడిలో కూడా, తాము ఎంచుకున్న క్రీడలో ప్రధమ స్ధానంలో నిలిచి, గ్రామ ప్రజల జేజేలు అందుకున్నారు.

మండలంలోని కటెవరం గ్రామానికి చెందిన మాజీ మునసబ్ సోమిశెట్టి బుల్లెయ్య, అదే గ్రామానికి చెందిన ఆళ్ళ వీరారెడ్డి, ఈనెల 13,14,తేదీలలో, జిల్లా కేంద్రాలైన, బాపట్ల, గుంటూరు పట్టణాలలో 7,వ, రాష్ట్రస్ధాయి మాస్టర్ అద్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన పోటీలలో, మాజీ మునసబ్ సోమిశెట్టి బుల్లెయ్య గుంటూరు జరిగిన రాష్ట్ర స్ధాయి, జావెలెన్ త్రో ,లాంగ్ జంప్, త్రిబుల్ జంప్ పోటీలలో ప్రధమ స్ధానం సాధించి, 3,మెడల్స్, సర్టిఫికేట్స్, అందుకోగా, ఆళ్ళ వీరారెడ్డి, బాపట్ల, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో, నిర్వహించిన పోటీలలో, షాట్ పుట్ విభాగంలో ప్రధమ స్ధానం సాధించారు. ఈసందర్భంగా సోమవారం విజేతలైన ఎనభై యేళ్ళ యువకులను, గ్రామ పెద్దలు, మీడియా సమావేశం ఏర్పాటు చేసి తమ ఆనందాన్ని చాటుతు అభినందనలు తెలిపారు. అనంతరం విజేతలు తమ అనుభవాలను మీడియాతొ పంచుకున్నారు. కార్యక్రమంలో లక్కరాజు శ్రీనివాసరావు, లక్కరాజు ఉమాకాంత్, మత్తె రవీంద్ర, కొల్లి ఉమా శంకర్ రెడ్డి, సోమిశెట్టి కోటేశ్వరరావు, అమ్మిశెట్టి సురేష్, పుట్టా కిషోర్, లక్కరాజు హరి తదితర గ్రామస్తులున్నారు.

## రాజకీయ ఘనాపాటి యడ్లపాటి జయంతి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** యడ్లపాటి వెంకట్రావు ఆపేరు వినగానే స్పురణకు వచ్చేవి, ఆజానుబాహుడు, మేధో సంపన్నుడు, పరిణితి చెందిన ప్రజానాయకుడు అన్నిటికీ మించి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, నేటి కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుచే, జిల్లాలో పార్టీకి పెద్దాయన అని పిలిపించుకున్న మహానేత యడ్లపాటి వెంకట్రావు రాజకీయాలలో విలువలు పాటించిన ఘనాపాటి.

ఆమహనీయుడి 107వ, జయంతి వేళ, ఘనమైన నివాళులు అర్పించారు. స్ధానిక బుర్రిపాలెం రోడ్ లోని ఎడ్లపాటి వెంకట్రావు నివాసంలో సోమవారం ఆయన 107వ జయంతిని పురస్కరించుకొని, అభిమానులు ఎడ్లపాటి విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఎడ్లపాటి వెంకట్రావు తో సన్నిహిత సంబంధాలు ఉన్న స్ధానిక నాయకులు వారి అభిప్రాయాలను మీడియాతో పంచుకున్న వైనమిది. 1919 డిసెంబర్ 16వ తేదీన, నేటి బాపట్ల జిల్లా అమృతలూరు మండలంలోని బోడపాడు గ్రామంలో, ఎడ్లపాటి వెంకటసుబ్బయ్య రాఘవమ్మ దంపతులకు జన్మించిన తొలి సంతానం ఎడ్లపాటి వెంకట్రావు. గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో బిఎ డిగ్రీ పుచ్చుకొని, చెన్నైలో లా కాలేజీలు చదువుతూ విద్యార్ధి నాయకుడయ్యాడు. రైతు నాయకుడు ఎన్జీరంగా ముఖ్య అనుచరుడిగా, కృషి కార్ లోక్ పార్టీ,స్ధాపనలో ప్రముఖ పాత్ర వహించారు. స్వతంత్ర పార్టీ అభ్యర్ధిగా వేమూరు నియోజక వర్గం నుండి 1962,నుండి1972 వరకు నాలుగు పర్యాయాలు పోటీ చేసిన వెంకట్రావు రెండు సార్లు గెలుపు జెండా ఎగరేశారు. మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో ప్రణాళిక, న్యాయశాఖ మంత్రిగా, వ్యవసాయశాఖ మంత్రిగా విలువైన సేవలు అందించిన యడ్లపాటి, 1989 నుండి తెలుగుదేశం పార్టీలో, పోలిట్ బ్యూరో సభ్యునిగా, తెలుగురైతు అధ్యక్షుడిగా పార్టీ ద్వారా సేవలు అందించిన వెంకట్రావు, 1995లో గుంటూరు జిల్లాపరిషత్ చైర్మన్ గా, ఎన్నికై, జిల్లా వ్యాప్తంగా మెరుగైన సేవలు అందించి, అభిమాన జనానికి ఆపద్భాంధవుడిగా తోడ్పాటు అందించారు. 1998లో రాజ్యసభకు ఎన్నకైనారు. తమ 102వ, ఏట,పిబ్రవరి 28,2022న, హైదరాబాద్ లోని,కుమార్తె నివాసంలో తుదిశ్వాస విడిచారు. అజాతశత్రువుగా అందరి ఆలోచనలతో, తమ ఆలోచనలను పంచుకుంటూ పెద్దాయనగా జీవితాన్ని ముగించిన యడ్లపాటి వెంకట్రావు జయంతివేళ ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న వారిలో, మైనేని మురళీకృష్ణ, వి ఎస్ కె ప్రసాద్, సుంకర హరికృష్ణ, వంగా సాంబిరెడ్డి, రావి చిన్ని, శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

## పార్లమెంట్ స్థాయి సంఘ నివేదికను వక్రీకరించడం తగదు

○ ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డా. ఆలా వెంకటేశ్వర్లు




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :వైద్య విద్యపై ఇటీవల పార్లమెంట్ స్థాయి సంఘం ఇచ్చిన నివేదికకు వక్ర భాష్యాలు చెప్పి ప్రజలను మభ్యపెట్టడం సబబు కాదని ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ తెలిపింది.

ఈనెల 16వ తేదీ గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ సమావేశమై కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాఎ ఆలా వెంకటేశ్వర్లు, కో కన్వీనర్లు కె.ఎస్.లక్ష్మణరావు,వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మీడియాతో మాట్లాడారు. డా. ఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ పార్లమెంట్ స్థాయి సంఘ నివేదికలో పీపీపీ పద్ధతిలో కొత్త మెడికల్ కళాశాలలకు పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలని పేర్కొంటే ఇందుకు విరుద్ధంగా నేటి ప్రభుత్వం ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు సంబంధించిన దాదాపు 600 ఎకరాల అత్యంత విలువైన భూములు, లక్షలాది చదరపు అడుగుల నిర్మాణాలు, రెండు సంవత్సరాల పాటు ప్రైవేట్ యాజమాన్యం నియమించిన వైద్యులు, ఇతర సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వమే జీతభత్యాలను చెల్లిస్తామని ప్రకటించడం ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు పంచిపెట్టడమే నని విమర్శించారు.

విద్యార్థులపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని పార్లమెంటరీ స్థాయి సంఘం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించగా, మన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పీపీపీ లో అమలు కాబోతున్న వైద్య కళాశాలపై యాజమాన్య హక్కు రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటుందని పేర్కొన్నారు గాని, ఆయా మెడికల్ కళాశాలల్లో సిబ్బంది నియమకాలపై, రిజర్వేషన్ల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

రాష్ట్ర కో కన్వీనర్, శాసన మండలి మాజీ సభ్యులు కె.ఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల నిర్వహణను ప్రజలు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నారని, ప్రజాభిప్రాయాన్ని గౌరవించి కూటమి ప్రభుత్వం వెంటనే 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. రాష్ట్ర కో కన్వీనర్ జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ పీపీపీ విధానాన్ని వ్యతిరేకించే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులందరినీ కలుపుకొని ఐక్యంగా ఉద్యమించాలని, జనవరి 9న విజయవాడలో ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించాలని, డిసెంబర్ 22న ఆధోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని, డిసెంబర్ 18న భారత కమ్యూనిస్ట్ పార్టీ పీపీపీ విధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగస్వామ్యమౌతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ప్రజలకు బీమా వ్యాప్తిని మరింత పెంచాలి



- బీమా కంపెనీలకు మరిన్ని లైసెన్సులు ఇవ్వాలి
- లోక్ సభలో సబ్‌కా బీమా సబ్‌కీ రక్ష బిల్లుకు మద్దతు తెలిపిన ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** భారతదేశం ప్రస్తుతం 70 నుండి 72 బీమా కంపెనీలతో మాత్రమే పనిచేస్తుందని, అదే శ్రీలంక లాంటి చిన్న దేశమే 50 కంపెనీలను కలిగి ఉందని, ఇది చిన్న దేశంతో పోల్చినప్పుడు, ఎక్కువ జనాభా కలిగిన మన దేశానికి బీమా కంపెనీల సంఖ్య చాలా తక్కువగా ఉందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు లోక్ సభలో మాట్లాడారు. క్రెడిట్ వ్యాప్తిని పెంచడానికి బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్బిఎఫ్ఎస్) లకు అనేక లైసెన్సులు మంజూరు చేయడంలో ఆర్బిఐ దృష్టి సారించడంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ చొరవ చూపాలని కోరారు. ఈరోజు కేంద్రం తీసుకొచ్చిన సబ్‌కా బీమా సబ్‌కీ రక్ష బిల్లుకు టీడీపీ తరుపున ఎంపీ లావు మద్దతు తెలిపారు. భారతదేశంలో బీమా వ్యాప్తిని పెంచాల్సిన కీలకమైన అవసరాన్ని లేవనెత్తుతు.. జాతీయ రేటు కేవలం 3.7% గా ఉందని, ఇది ప్రపంచ రేటు అయిన 7% తో పోలిస్తే తక్కువగా ఉందన్నారు. బీమా కంపెనీలను నియంత్రించే నియంత్రణ సంస్థ, భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్డిఏఐ)కొంచెం కఠినంగా ఉందన్నారు. ఎంతో ఉపయోగకరంగా ఉండే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ఆరోగ్య బీమా వంటి పథకాలను విస్తృతం చేసి మరింత పటిష్టంగా అమలు చేయాలని, బీమా సకాలంలో అందేలా చూడాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బీమా సౌకర్యాన్ని పెంచే లక్ష్యంతో ఆర్థిక శాఖ తీసుకొచ్చిన చర్యలను ప్రశంసించారు. ముఖ్యంగా, వ్యక్తిగత ఆరోగ్య బీమాపై జీఎస్టీని 18% నుండి 0%కి తగ్గించడం, బీమాలో 100% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ( ఎఫ్ డిఐ) అనుమతించాలనే నిర్ణయాలు బీమా పాలసీలకు మంచి పరిణామం అన్నారు.

## ఏసుక్రీస్తు బోధనలు ఆచరించాలి



- క్రిస్మస్ వేడుకల్లో మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ) :** శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం విశిష్టతలను చాటుతూ ఏసుక్రీస్తు బోధించిన సూక్తులను ప్రజలందరూ ఆచరించాలని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. మంగళవారం విజయవాడలో దహించు అగ్ని ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా మంత్రి ఫరూక్ హాజరయ్యారు. దాదాపు 1000 మంది కి పైగా హాజరైన పాస్టర్ల ను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలను మంత్రి తెలిపారు. ఏసు క్రీస్తు బోధించిన శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం వంటి విలువలు ప్రపంచ మానవాళికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. దైవ సందేశాన్ని ప్రజలకు చేరవేయడంతో పాటు, సామాజిక సేవ, పేదలకు సహాయం చేయడంలో పాస్టర్లు ముందుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రైస్తవుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక పథకాలను అమలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం నేతృత్వంలో పాస్టర్లకు గౌరవ వేతనాలు అందించడం జరుగుతున్నదన్నారు. మంత్రి ఫరూక్ ను దహించు అగ్ని మినిస్ట్రీస్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

## గుంటూరు నగర అభివృద్ధిపై వైసీపీ దుష్ప్రచారం మానాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి తదితర వైసీపీ నేతలు కావాలనే దుష్ప్రచారం చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మండిపడ్డారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌పై అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు.

మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ%ౌ% "ప్రజలు సత్తెనపల్లిలో తిరస్కరించిన అంబటి రాంబాబు గుంటూరుకు వచ్చి కేంద్రమంత్రిపై విమర్శలు చేయడం హాస్యాస్పదం. రాజకీయ మనుగడ కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు" అని విమర్శించారు. శంకర్ విలాస్ బ్రిడ్జి వద్ద మూడు రోజుల క్రితం వైసీపీ నేతలు రాజకీయ లబ్ధి కోసం బురద జల్లే ప్రయత్నం చేశారని ఆరోపించారు.

ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఏం చేశారో ప్రజలే చూసి వారికి 11 సీట్లకే పరిమితం చేశారని, కూటమి ప్రభుత్వం మాత్రం ఒకటిన్నర సంవత్సరంలోనే అభివృద్ధిలో స్పష్టమైన మార్పు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. "అంబటి రాంబాబు గుంటూరు ఎమ్మెల్యేలు డమ్మీలు అని వ్యాఖ్యానించడం అర్థరహితం. మా అభివృద్ధి మీ గుండెల్లో డైనమైట్‌లాగా, ప్రజల గుండెల్లో డైమండ్‌లాగా నిలిచింది" అని ఎమ్మెల్యే అన్నారు.

ఆర్‌ఓబి అంశంపై స్పందిస్తూ "ఇది ఫ్లైఓవర్ కాదు రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌ఓబి). ఫ్లైఓవర్, ఆర్‌ఓబి మధ్య తేడా కూడా తెలియకుండా మాట్లాడటం బాధాకరం" అని అన్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంపై హేళనగా మాట్లాడటం అవగాహన లోపానికి నిదర్శనమని పేర్కొన్నారు.

డ్రెయిన్లు, రోడ్ల విస్తరణ వంటి అభివృద్ధి పనుల్లో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ముందుకెళ్తున్నామని, ప్రతి నిర్ణయానికి ముందు అధికారులతో సమీక్షలు, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రమంత్రి, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రతి వారం గుంటూరులోనే ఉండి సమీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు.

"అభివృద్ధి సమయంలో కొంత అసౌకర్యం తప్పదు. కానీ దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం ప్రజలు సహకరించాలి. కూటమి ప్రభుత్వం దుష్ప్రచారాలతో కాదు.. అభివృద్ధితోనే ముందుకు సాగుతుంది" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

# కేంద్రంతో చర్చించి ఏలూరుకు సంగీతం నృత్య కళాశాల మంజూరుకు కృషి చేస్తా

- ఏలూరు జిల్లా పురావస్తు మ్యూజియంను ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్



**ఏలూరు, (జర్నలిస్ట్ ఫైల్ ) :** కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తో చర్చించి ఏలూరుకు సంగీత నృత్య కళాశాల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. రూ. 5.25 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఏలూరు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా పురావస్తు ప్రదర్శనశాలను మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం జిల్లా పురావస్తు మ్యూజియంలోని డిజిటల్ బుక్ రూమ్ ను, స్కల్ప్చర్ గ్యాలరీని సందర్శించారు. అధునాతన టెక్నాలజీతో రూపొందించిన డిజిటల్ బుక్ లో ప్రతి పేజీలోని ఇమేజిని తాకితే ప్రత్యక్ష అనుభూతిని పొందడం ఆశ్చర్యంగా ఉందని ఆసక్తిగా తిలకించారు. అదే విధంగా కాంస్య కళతో రూపొందించిన శ్రీరామ, లక్ష్మీనారాయణ, గరుడ, వైష్ణవ ఋషి, మావటి విగ్రహాలను తిలకించారు. భారతీయ జీవితాన్ని, ఆలోచనలు ప్రతిబింబింప చేసిన హిందూ, జైన, బౌద్ధ మతాలకు సంబంధించిన బుద్ధుడు, జైన తీర్థంకరులు, విష్ణువు వెంకటేశ్వరుడు, ఆల్వార్లు, శ్రీదేవి, భూదేవి, నటరాజ కాంస్య శిల్పాలను పరిశీలించారు. నాటి కాలానికి సంబంధించిన శిరస్త్రాణం, ఖడ్గములు, డాలు, ఆయుధాలు, కవచాలను చూసారు. తొలి చారిత్రక యుగపు మృణ్మయ పాత్రలు, బృహత్ శిలాయుగం నాటి సమాధులు, జీవన విధానాలను తెలిపే చిత్రాలను, ప్రాచీన, మధ్య, నవీన శిలాయుగాల నాటి పరికరాలను, ఆది మానవుడిని మొదలుకొని నేటి మానవ వికాస దశలను, రుద్రమకోట బృహ శిలాయుగ సమాధులను పరిశీలించారు. అదే విధంగా తూర్పు చాళుక్యులు, తుగ్లక్, విజయనగర వంశం, శాలం కాయనుల, శాతవాహన, సదవంశం, విద్ధంక, కుర రాజవంశ, ఈస్ట్ ఇండియా, పోర్చుగీస్, ట్రావెన్ కోర్ సంస్థానం, బ్రిటిష్ ఇండియా, ఇండో ఫ్రెంచి, సుమత్రా దీవి, హెల్కర్, బహుమనీ, గోల్కొండ సుల్తానులు, మధురై నాయక వంశం, మరాఠా సామ్రాజ్యం, అసబ్ జాహీ కాలం నాటి నాణేలు, పంచలోహ విగ్రహాలు, శిలాజాలు, తాళపత్ర గ్రంధాలు, తామ్ర శాసనాలు, ఖురాన్ చేతి ప్రతి గ్రంధాలు పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ హేలాపురిగా కీర్తి పొందిన ఏలూరు చరిత్రను వివరించారు. భావితరాలకు ప్రాచీన సంస్కృతిని తెలిపేది పురావస్తు శాఖ అన్నారు. మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి అంకురార్పణ చేసిన మ్యూజియాన్ని నేటి ఎమ్మెల్యే బడేటి చంటి పూర్తి చేయడం ఆనందం గా ఉందన్నారు. ప్రపంచం నలుమూలల రాష్ట్ర గొప్పతనాన్ని తెలిపేలా మ్యూజియం ఏర్పాటు చేయడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. దాదాపు 10 లక్షల సంవత్సరాలనుండి 1000 సంవత్సరాల వరకు ఉన్న ప్రతి పరికరాన్ని మ్యూజియంలో భద్రపరిచారన్నారు. పోలవరం సమీపంలోని రుద్రమకోట వద్ద తవ్వకాల్లో లభ్యమైన అరుదైన మట్టి బొమ్మలు, తాబేలు పూసలు ప్రదర్శించడం మరొక ప్రత్యేకత అన్నారు.

సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో చరిత్ర, సాంప్రదాయ సిద్ధమైన కళా, సాంస్కృతిక వైభవానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. గత ప్రభుత్వం కళలను, కళాకారులను పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కవులు, కళలు, కళాకారులను గౌరవించి ఉగాది పురస్కారాలు, నాటక రంగ దినోత్సవం సందర్భంగా కందుకూరి రంగస్థల, విశిష్ట పురస్కారాలు అందజేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర కళా, సాంస్కృతిక వైభవాన్ని ముందు తరాలకు తెలిసేలా, ప్రజా బహుళ్యం లోకి వెళ్లేలా విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఏపీలోని రాజమహేంద్ర వరానికి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా విభాగాన్ని కేటాయించాలన్న విజ్ఞప్తికి కేంద్రం సూత్రప్రాయ అంగీకారం తెలిపిందని మంత్రి దుర్గేష్ అన్నారు. అదే విధంగా పలువురు విజ్ఞప్తి మేరకు ఆర్కియాలజీ మ్యూజియంకు సంపూర్ణ సహకారం అందిస్తామని, 3వ అంతస్తు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు.

తాను ఇటీవల లండన్ పర్యటనకు వెళ్ళినప్పుడు నేషనల్ థియేటర్ ను సందర్శించానని, నేటికీ అక్కడ మన కళలకు ప్రాధాన్యత ఉందని మంత్రి దుర్గేష్ గుర్తు చేశారు. అదే విధంగా లండన్ మ్యూజియం విశేషాలు తెలిపారు. ప్రతి ఒక్కరూ మ్యూజియంను సందర్శించి నాటి వైభవాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), నగర మేయర్ నూర్జహాన్ బేగం, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డప్పల నాయుడు, కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి, స్థానిక మార్కెట్ యార్డ్ చైర్మన్, ఇడా చైర్మన్, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, ప్రముఖ చరిత్రకారులు అయ్యంగార్, ఆర్కియాలజీ అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అసూయ, ద్వేషాలకు కేరాఫ్ అంబటి

- అభివృద్ధి అంటే అర్థం తెలుసా ?
- గుంటూరులో ప్రగతి కనిపించడం లేదా ?
- చౌకబారు వ్యాఖ్యలను ప్రజలకు సహించరు
- మరో ఎనిమిది నెలల్లో నందివెలుగు బ్రిడ్జి నిర్మాణం పూర్తి
- నిర్ణీత సమయంలోనే శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం
- నందివెలుగు బ్రిడ్జి పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ) :** అసూష, ద్వేషాలు మెండుగా కలిగిన వైసీపీ నేత అంబటి రాంబాబుకు అభివృద్ధి అంటే ఏంటో తెలుసా అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ ప్రశ్నించారు. మంగళవారం స్థానిక నందివెలుగు బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో శిథిలావస్థకు చేరిన నందివెలుగు బ్రిడ్జిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంలో నిర్మాణ పనులు చేపట్టామని వెల్లడించారు. మరో ఎనిమిది నెలల్లో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందిస్తామని తెలిపారు. అరండల్ పేట శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణాన్ని నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. వీటితోపాటు గుంటూరు నగరంలోని సంజీవయ్య నగర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణాలను సైతం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ప్రత్యేక చొరవ తీసుకుని నిర్మాస్తుంటే అంబటి అవాకులుచవాలు పేలడం సరికాదని పేర్కొన్నారు. గుంటూరు నగర అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ఎవరైనా రావచ్చని సూచించారు. మరో రెండేళ్లలో గుంటూరును అభివృద్ధిలో రోల్ మోడల్ గా తీర్చిదిద్ది వైసీపీ నేతలను డమ్మీలుగా మారుస్తామని తెలిపారు. జలవనరుల శాఖ మంత్రిగా పని చేసిన వైసీపీ నేత అంబటి రాంబాబుకు శంకర్ విలాస్ బ్రిడ్జిపై చేసిన వ్యాఖ్యలు తన దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. గుంటూరు చరిత్రలో ఎన్నడూలేని విధంగా కేవలం 18 నెలల కాలంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని స్పష్టం చేశారు. గుంటూరు నగర అభివృద్ధిని ఐదేళ్లలో 60 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిన వైసీపీ నేతలా ? కూటమి ప్రభుత్వంలో చేస్తోన్న అభివృద్ధి గురించి మాట్లాడేది అని నిలదీశారు. నోరు ఉందని ఎలా అంటే అలా మాట్లాడితే ప్రజలు సహించబోరని స్పష్టం చేశారు.. కుటిల రాజకీయాలతో అభివృద్ధిని అడ్డుకోవాలని కుట్రలు పన్నితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అంబటికి హెచ్చరించారు. గుంటూరు శాసనసభ్యులందరం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానితో సమన్వయం చేసుకుంటూ అన్ని ప్రాంతాలను ప్రగతి పథంలోకి తీసుకెళుతున్నామని, అందుకే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. అభివృద్ధికి అడ్డుపడాలనే చౌకబారు విధానాలను ఇకనైనా వదిలిపెట్టాలని అంబటికి ఎమ్మెల్యే నసీర్ హితవు పలికారు. ప్రజా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. వైసీపీ నేతలు అమరావతి రాజధానిపై మూడు ముక్కలాట అడి విధ్వంసం చేశారని తెలిపారు.

## కోటి సంతకాల పేరుతో డ్రామా మంత్రి సత్యకుమార్ యాదవ్




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వైద్య కళాశాలల పిపిపి విధానంపై ప్రజా మద్దతు లభించకపోవడంతో, రాజకీయ ఉనికి కోసం వైపిసి అధినేత వైఎస్ జగన్ కోటి సంతకాల డ్రామా ఆడుతున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. ప్రజారోగ్యాన్ని, విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని 10 వైద్య కళాశాలలను పిపిపి విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయిస్తే, ప్రైవేటుపరం చేస్తున్నారని జగన్ ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమవేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో పిపిపి విధానం పెను విప్లవాన్ని సృష్టించబోతుందని పేర్కొన్నారు.

సంపద సృష్టికి పిపిపి విధానాన్ని ఒక సాధనంగా వాడుకోవడంలో ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. నీతి ఆయోగ్ ఈ విధానాన్ని అమలు చేయడంలో తప్పులేదని స్పష్టం చేసిందన్నారు. రక్షణ రంగంలోనూ పిపిపి విధానంలో పలు ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు. 10 వైద్య కళాశాలలపై యాజమాన్య హక్కులు ప్రభుత్వం వద్దనే ఉంటాయన్నారు.

# కోటి సంతకాల పేరిట వైసీపీ మెలో డ్రామా



- ఏ పి టి ఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ
- ప్రజల్లో స్పందన లేకపోయినా నాటకాలు
- జనం ఛీకొడుతున్నా ఆగని వైసీపీ నాయకుల దుష్ప్రచారం
- మండిపడ్డ ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** పచ్చ కామెర్లు వచ్చినోడికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది అన్నట్లు.. కూటమి ప్రభుత్వంపై కత్తిగట్టిన జగన్‌కు ప్రభుత్వం చేపట్టే మంచిపనులు కూడా ఘోర తప్పుల్లాగానే కనిపిస్తున్నాయి. మెడికల్ కాలేజీల పీపీపీ విధానం వల్ల చాలా లాభలు ఉన్నాయని ప్రభుత్వం స్పష్టంగా చెబుతున్నా... ఏదో అన్యాయం జరిగిపోతొందని వైసీపీ నాయకుల రాద్ధాంతం చేయడం హాస్యాస్పదం. అన్నీ అసత్యాలు ప్రచారం చేస్తూ కోటి సంతకాల పేరిట డ్రామాకు తెరతీశారు." అని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజల విషయం పక్కన పెడితే, వైసీపీ చేస్తున్న నిరసనలకు కనీసం ఆ పార్టీ కార్యకర్తల నుంచి కూడా స్పందన కరువైందన్నారు. పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణంపై పార్లమెంట్ స్థాయి సంఘం పలు సిఫార్సులు చేసిందని, ఒక్కో మెడికల్ కాలేజీలో 250 యూజీ సీట్లు పెంచుకునే వెసులుబాటు ఉందని తన నివేదికలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసిందని మోహనకృష్ణ ఈ సందర్భంగా గుర్తు చేశారు. మెడికల్ కాలేజీల నిర్మాణంపై హైకోర్టు సమర్థించినా ప్రతిపక్ష నేతల్లో మార్పు కనిపించకపోవడం దురదృష్టకరమని, మెడికల్ కాలేజీల నిర్మాణంపై ఎక్కడైనా చర్చకు తమ కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**పీపీపీ విధానంతో ఎన్నో ప్రయోజనాలు...**

పీపీపి విధానంలో రాష్ట్ర విద్యార్థులకు అదనంగా 220 మెడికల్ సీట్లు (110- ప్రభుత్వ కోటా, 110 - ప్రైవేట్ కోటా) అంది వస్తాయి. రెండేళ్లలోనే 10 మెడికల్ కాలేజీలు పూర్తయ్యి 1750 మెడికల్ సీట్లు త్వరగా అందుబాటులోకి వస్తాయి. పీపీపీ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు పేదలకు అందుతాయి. పీపీపీ వల్ల కేంద్ర కోటా 15% సీట్లు బయటకు వెళ్లవు. మన విద్యార్థులకు మరిన్ని అవకాశాలు దక్కుతాయి. పీపీపీ విధానంలో ఫీజుల నిర్ణయం ప్రభుత్వ కనుసన్నల్లోనే ఉంటుంది. ఈ విధానంతో వేలాది పేద విద్యార్థులు డాక్టర్లు అయ్యే అవకాశం ఉంటుంది. జగన్ చేసినట్టు చేస్తే ఈ 1750 సీట్లు పొందాలంటే 15 ఏళ్లు ఎదురు చూడాలి. పీపీపీ విధానంలో 50 శాతం మెడికల్ సీట్లు ప్రభుత్వ(కన్వీనర్)కోటా లోనే ఉంటాయి. జగన్ ప్రైవేటుకు కేటాయించిన సీట్లే పీపీపీ పద్ధతిలో ప్రమోటర్ భర్తీ చేస్తారు. ఈ విధానంలో కాలేజీల యాజమాన్య హక్కులన్నీ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉంటాయి. ప్రభుత్వ నిబంధనలే అమలవుతాయి. ఇవన్నీ తెలిసీ అడ్డగోలుగా అసత్యాలు ప్రచారం చేస్తున్న జగన్ ను మించిన అభివృద్ధి నిరోధకులు ఇంకెవరుంటారు?

**అంతా ప్రభుత్వం చేతిలోనే...**

పీపీపీతో విధానంలో వైద్యకళాశాలకు "ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రి" అనే పేరు తప్పనిసరిగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కళాశాలలకు కేటాయించిన భూములను ఎలాంటి వాణిజ్యపరమైన, వైద్యేతర కార్యక్రమాలకు వినియోగించకూడదు. కేటాయించిన భూముల్లో 625 పడకల ఆసుపత్రి, 150 యుజి, 24 పీజీ సీట్లతో కూడిన కాలేజీ నిర్మాణం, వసతి గృహాలు, బోధన, ఇతర సిబ్బంది నివాసాల కల్పనకు ప్రాధాన్యమిచ్చారు. భవిష్యత్ అవసరాల మేరకు దంత వైద్య, నర్సింగ్ కళాశాలలు, టెలీమెడిసిన్, ఇతర శిక్షణ, ఆయుష్ కేంద్రాలు ఏర్పాటు చేయవచ్చు. ఆ అదనపు కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయంలో 3శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. పీపీపీ విధానంలో ఆయా కాలేజీలకు సంబంధించిన బోధనాసుపత్రుల్లో ప్రస్తుతం పని చేస్తున్న వైద్య, ఇతర సిబ్బంది జీతాలను రెండేళ్లపాటు ప్రభుత్వమే భరిస్తుంది. ఇలా అంతా ప్రభుత్వ నిర్దేశంలోనే ఉంటే, అంతా ప్రయివేటు పరం అవుతోందని జగన్ లేనిపోని రచ్చ చేస్తుండడం హేయం. ఇది ఆయన దుర్మార్గపు మనస్తత్వానికి నిదర్శనం.

**జగన్ వి మొసలి కన్నీళ్లు:** 2014-19 మధ్య చంద్రబాబు పాలనలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 15శాతం కేంద్ర కోటా పోగా మిగిలిన అన్ని మెడికల్ సీట్లు ప్రభుత్వ కోటా లోనే ఉండేవి. రూ. 10వేల ఫీజు చెల్లిస్తే సరిపోయేది. ఈ విధానాన్ని జగన్ మారుస్తూ జీఓ 107, 108, 133 విడుదల చేసి 50శాతం మెడికల్ సీట్లు ప్రైవేటుకు కేటాయించారు. ఫీజులు కూడా భారీగా పెంచారు. సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరిని రూ. 12 లక్షలకు పెంచారు. ఎన్నారై కేటగిరి ఫీజు రూ. 20 లక్షలకు తీసుకెళ్లారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సగం సీట్లు ప్రైవేటుకు కేటాయించిన జగన్ నేడు ఏమీ ఎరగనట్లు మొసలి కన్నీరు కారుస్తున్నారు. జగన్ అమలుచేసిన విధానంలో 50శాతం సీట్లు ప్రైవేటుకు వెళ్లడమే కాక మరో 15 శాతం సీట్లు కేంద్ర కోటాలో ఇతర రాష్ట్రాలకు దక్కుతాయి. ఒంటెత్తు పోకడతో తోచినట్లు నిర్ణయాలు తీసుకోవడం తప్ప వైద్య విద్య బాగు గురించి జగన్ ఏనాడు పట్టించుకున్న పాపానపోలేదు.

# ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఎదగాలి

- విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్
- సత్తెనపల్లిలో అట్టహాసంగా ప్రారంభమైన 'విజ్ఞాన్ బాల మహోత్సవ్'
- జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో మెగా వేడుకలు
- 2 వేల మందికి పైగా విద్యార్థుల హాజరు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థులు ఎల్లప్పుడూ ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో చిన్నారుల కోసం సత్తెనపల్లి పట్టణం సుగాలి కాలనీలోని జడ్పీ హైస్కూల్ మైదానంలో విజ్ఞాన్ బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల నుంచి విచ్చేసిన విద్యార్థులు ముందుగా ఉత్సాహభరితంగా మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించాలని సూచించారు. శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువుపై దృష్టి పెట్టినప్పుడే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

ఫిజికల్‌గా ఫిట్‌గా ఉంటే మెంటల్‌గా కూడా బలంగా ఉంటారని, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఇలాంటి బాల మహోత్సవాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బృందస్ఫూర్తి, క్రమశిక్షణ, సహకారం వంటి విలువలు పెంపొందుతాయని అన్నారు. చిన్ననాటి నుంచే ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే విద్యార్థులే భవిష్యత్తులో జీవితంలో ఉన్నతంగా స్థిరపడతారని పేర్కొన్నారు. మీ కలలను నిజం చేసుకునే శక్తి మీలోనే ఉందని, అంకితభావంతో కృషి చేస్తే ఏ లక్ష్యమైనా సాధించవచ్చని విద్యార్థులను ప్రోత్సహించారు. క్రీడలు కేవలం శారీరక ఉల్లాసానికే కాకుండా మానసిక ఉల్లాసానికి, స్నేహబంధాల బలోపేతానికి కూడా దోహదపడతాయని అన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మకత అంశాల్లో ప్రతిభ చూపినప్పుడే ఒక విద్యార్థి సంపూర్ణంగా ఎదుగుతాడని స్పష్టం చేశారు.

**పోటాపోటీగా సాగుతున్న క్రీడా పోటీలు**

విజ్ఞాన్ బాల మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థులు నువ్వానేనా అన్నట్లుగా ఉత్సాహంగా పోటీపడుతున్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ బాల మహోత్సవ్‌లో మొత్తం 43 పాఠశాలల నుంచి 2,000 మందికి పైగా బాలబాలికలు పాల్గొన్నారు. జూనియర్స్ (అండర్%-



%14), సీనియర్స్ (అండర్-17) విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, చెస్, 100 మీటర్లు, 800 మీటర్లు, 4"100 మీటర్ల రిలే, లాంగ్‌జంప్, షాట్‌పుట్ వంటి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలు ప్రస్తుతం సెమీఫైనల్స్ దశకు చేరుకున్నాయని, బుధవారం ఫైనల్స్ మ్యాచ్‌లు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, జడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జీ. కోటేశ్వరరావు, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ షేక్ రియాజ్, విజ్ఞాన్స్ వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్లు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467